# శుభోదయం!
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ | సంపుటి 02, | సంచిక 216, | పేజీలు -06 | బుధవారం - 16 - జూలై - 2025 | వెల రూ.2/-


## ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా మాస్కోపై దాడి చేయగలవా?



- జెలెన్ స్కీని అడిగిన ట్రంప్!

ఇటీవల ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ కాల్ సంభాషణ

ట్రంప్ ప్రతిపాదనకు నో చెప్పిన పుతిన్!

## విమాన ఇంజిన్ వైఫల్యాలు.. డీజీసీఏ నివేదికలో కీలక విషయాలు



ఐదేళ్ల కాలంలో 65 విమాన ఇంజిన్ వైఫల్యాలు

జనవరి 1, 2024 నుంచి మే 31, 2025 మధ్య కాలంలో 11 మే డే కాల్స్

అన్ని సమయాల్లో పైలట్లు సమస్యను పరిష్కరించకపోవచ్చున్న డీజీసీఏ నివేదిక

## జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు... భూసేకరణను అడ్డుకోవాలని వినతి



అమరావతి: నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో తమ సారవంతమైన భూములను ఇండోసోల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న రైతులు మంగళవారం నాడు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీఅధినేతజగన్‌ను,కలిశారు. సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండే తమ సంట భూములను సోలార్ పరిశ్రమకు



### కవిత కాంగ్రెస్ లో చేరేందుకు రంగం సిద్ధమైంది: తీన్మార్ మల్లన్న

- మంత్రిగా ప్రమాణం చేసే అవకాశం కవితకు వచ్చిందన్న తీన్మార్ మల్లన్న
- అగ్రకులాల వాళ్లు బీసీలపై దాడి చేయాలని చూస్తున్నారని ఆరోపణ
- తనపై దాడి చేసింది కవిత బంధువేనన్న మల్లన్న

## ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం...

హాజరైన టీడీపీ నాయకులు

- ఎన్నికల విధానాల్లో సంస్కరణ, ఓటరు జాబితాల్లో సంస్కరణలపై చర్చ
- అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన ఈసీ
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఢిల్లీ వచ్చి సమావేశంలో పాల్గొన్న టీడీపీ బృందం



ఢిల్లీ: సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధానాల్లో సంస్కరణలు, ఓటరు జాబితా సవరణలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఢిల్లీలో అఖిల పక్ష సమావేశం నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు యాదవ్, టీడీపీ ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ, ఓటరు జాబితాల్లోని లోపాలను సరిచేయాలన్న

# తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నది మా ఆలోచన

- ★ పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తుంది
- ★ శామీర్‌పేట్ జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్‌కు ముఖ్యమంత్రి గారు భూమిపూజ
- ★ ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని స్పష్టం



హైదరాబాద్: పారిశ్రామిక రంగంలో పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తుందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, రాయితీలు, అనుమతులను మంజూరు చేయడం వంటి సానుకూల వాతావరణం కల్పిస్తామని చెప్పారు. శామీర్‌పేట్ జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయాలజిక్స్ కొత్త యూనిట్‌కు ముఖ్యమంత్రి గారు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, వివేక్ వెంకటస్వామి గారు, శాసనసభ్యులు పి. సుదర్శన్ రెడ్డి గారు, ఐకార్ మేనేజింగ్ డైరెక్టర్ సూదిని ఆనంద రెడ్డి గారితో పాటు అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఐటీ, ఎలక్ట్రిక్ వెహికిల్స్, ఫార్మా, బయో సైన్సెస్‌లతో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడులతో ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. "ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడులకు చైనాకు ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక రంగం భారత్ వైపు



దృష్టి సారించగా, అందుకు అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణ ఉండాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నది మా ఆలోచన. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించగా, అందులో తెలంగాణ నుంచి 10 శాతం మేరకు



## లెక్చరర్ వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య... బీజేపీపై రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు

ఒడిశాలో బీఈడీ విద్యార్థినికి లెక్చరర్ నుంచి లైంగిక వేధింపులు

నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న బాధితురాలు

ఇది బీజేపీ చేసిన వ్యవస్థీకృత హత్య అన్న రాహుల్ గాంధీ

నిందితుడిని కాపాడేందుకు బీజేపీ వ్యవస్థ యత్నిస్తోందని ఆరోపణ





### విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి

ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారన్న కేటీఆర్

## నేడు ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశం.. కేంద్రానికి తెలంగాణ కీలక లేఖ



బనకచర్ల అజెండాపై తెలంగాణ అభ్యంతరం

పెండింగ్ ప్రాజెక్టులు సహా వివిధ అంశాలను అజెండాగా పంపిన తెలంగాణ

బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవన్న తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ అంశంపై చర్చించేందుకు

### రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకువచ్చాయి



ఏపీలో రాబోయే నాలుగేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు

అధికారులకు మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశం

సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచన

# ఏపీలో నాణ్యమైన మద్యం అమ్మకాలు జరగాలి

- మద్యం విధానంలో పారదర్శకతే ప్రధానమన్న సీఎం చంద్రబాబు
- జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు, నాణ్యత ఉన్న మద్యం విక్రయాలు మాత్రమే జరగాలన్న సీఎం
- పర్మిట్ రూమ్‌లను అనుమతించే అంశంపై కమిటీ అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలన్న సీఎం చంద్రబాబు


వివరాలు 2లో..

అమరావతి: మద్యం విధానంలో పారదర్శకతే ప్రధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన తేల్చి చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో అబ్కారీ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిన్న సమీక్ష నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న బ్రాండ్ల విక్రయాలన్నీ నిలిపివేయాలని ఆయన ఆదేశించారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు, నాణ్యత కలిగిన మద్యం విక్రయాలు మాత్రమే జరగాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యమైనది కాదని ఆయన అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటు సారా విక్రయాలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రజారోగ్యంపై ప్రభావం పడకుండా



నాణ్యమైన మద్యాన్ని మాత్రమే విక్రయించేలా చూడాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున నకిలీ బ్రాండ్ల విక్రయాలు జరిగాయని, తద్వారా ప్రజల ఆరోగ్యం పాడైందని అన్నారు.

నకిలీ బ్రాండ్లతో ప్రజారోగ్యంపై ప్రభావం

నకిలీ మద్యం బ్రాండ్ల కారణంగా ట్రేడ్ డైవర్ట్ అయ్యిందని, తద్వారా రాష్ట్రం ఆదాయం కోల్పోయిందని అన్నారు.

## ఏసీబీ అదుపులో తెలంగాణ నీటి పారుదల శాఖ మాజీ ఈఎన్‌సీ మురళీధర్ రావు



- మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావు నివాసంతో పాటు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ
- ఆదాయానికి మించి ఆస్తులు కల్గి ఉన్నారన్న అభియోగాలతో ఏసీబీ కేసు నమోదు
- పదవీ విరమణ తర్వాత 13ఏళ్లు కొనసాగిన మురళీధర్‌రావు

హైదరాబాద్: తెలంగాణ నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా బాధ్యతలు నిర్వహించిన విశ్రాంత ఇంజినీరింగ్ అధికారి మురళీధర్‌రావును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనపై



## మిథున్ రెడ్డికి హైకోర్టులో షాక్

- ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో మిథున్ రెడ్డికి ఎదురుదెబ్బ
- ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు
- సిట్ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా

## ఆయుధాలు ఇస్తే నువ్వు నేరుగా
# మాస్కోపై దాడి చేయగలవా?

ఢిల్లీ: ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటిదాకా శాంతి మంత్రం జపించిన ట్రంప్... ఇకపై రష్యాను ఒత్తిడిలోకి నెట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి. జులై 4న ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీతో జరిగిన ఒక ప్రైవేట్ సంభాషణలో, అవసరమైన ఆయుధాలు అందిస్తే మాస్కో మరియు సెయింట్ పీటర్స్‌బర్గ్‌లతో సహా రష్యా లోపల దాడులను తీవ్రతరం చేయగలరా? అని ట్రంప్ ప్రశ్నించినట్లు ఓ కథనం వచ్చింది. ఆ కథనం ప్రకారం... రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ ఫోన్ కాల్ సంభాషణ తీవ్ర నిరాశాజనకంగా ముగిసిన తర్వాత జెలెన్ స్కీతో ఈ చర్చ జరిగింది. కాల్పుల విరమణ చర్చలకు రష్యా నిరాకరించడంపై అమెరికాలో పెరుగుతున్న అసంతృప్తిని ఇది సూచిస్తోంది. రష్యాను నేరుగా ఎదుర్కోవడానికి వెనుకడుగు వేస్తున్న ట్రంప్ మునుపటి అభిప్రాయానికి ఇది భిన్నమైన వైఖరిగా భావిస్తున్నారు. రష్యన్లకు ఏదో విధంగా బాధ కలిగించి, వారిని చర్చలకు రప్పించడమే ట్రంప్ కొత్త వ్యూహమని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా దీర్ఘ శ్రేణి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందిస్తుందా లేదా అనేది స్పష్టంగా తెలియకపోయినా, రష్యా భూభాగంపై మరింత దూకుడు దాడులకు పాశ్చాత్య దేశాలు, మరియు అమెరికా విధాన రూపకర్తలలో మద్దతు పెరుగుతున్నట్టు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను అందిస్తామని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడం, అలాగే 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యా ఎగుమతుల కొనుగోలుదారులపై ఆంక్షలు విధిస్తామని బెదిరించడం వంటి పరిణామాలు మాస్కో మొండి వైఖరి కారణంగానే చోటుచేసుకున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

## విమాన ఇంజిన్ వైఫల్యాలు..
# డీజీసీఏ నివేదికలో కీలక విషయాలు

ఢిల్లీ: భారతదేశంలో గత ఐదేళ్లలో 65 విమాన ఇంజిన్ వైఫల్యాలు నమోదయ్యాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదం జరిగిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ విమానయాన సంస్థలు తమ విమానాల ఇంజిన్లు, ఇంధన స్విచ్‌ల మొదలైన వాటిపై అప్రమత్తమయ్యాయి. ప్రమాదాలను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో డీజీసీఏ ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికలో కొన్ని కీలక అంశాలను వెల్లడించింది. జనవరి 1, 2024 నుంచి 31, 2025 మధ్య కాలంలో 11 మే డే కాల్స్ నమోదైనట్లు తెలిపింది. మే డే కాల్స్ వచ్చినప్పటికీ పైలట్లు చాకచక్యంగా వ్యవహరించి ఆయా విమానాలను సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రమాదాలు తప్పాయని పేర్కొంది. చాలా వరకు విమానాల్లో పైలట్లు సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ, అన్ని సమయాల్లోనూ అలాంటి అవకాశం ఉండకపోవచ్చని అభిప్రాయపడింది. ఇంధన ఫిల్టర్లు బ్లాక్ కావడం, టర్బైన్ లోపాలు, ఇంధన కాలుష్యం, ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడం వంటివి ప్రధాన కారణాలుగా ఉంటున్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ సమాఖ్య అధ్యక్షుడు కెప్టెన్ సీఎస్ రాంధవా పేర్కొన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఎయిర్ సేఫ్టీ డైరెక్టర్ జోసెఫ్ మాట్లాడుతూ, విమానాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడం ప్రపంచవ్యాప్తంగా సాధారణంగా జరుగుతున్నప్పటికీ, భారత విమానాల్లో తరుచూ సమస్యలు తలెత్తుతుండటం ఆందోళనకరమని అన్నారు. ఇంధన స్విచ్ వైఫల్యం కారణంగానే ఎయిరిండియా విమానం కూలినట్లు ప్రాథమిక నివేదిక వెల్లడించిన నేపథ్యంలో, భారత విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్న లోపాలపై డీజీసీఏ ప్రత్యేక దృష్టి సారించినట్లు జోసెఫ్ తెలిపారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత బోయింగ్ విమానాల్లో ఇంధన స్విచ్ లాకింగ్ వ్యవస్థను తనిఖీ చేయాలని ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

## జగన్‌ను కలిసిన కరేడు గ్రామ రైతులు...
# భూసేకరణను అడ్డుకోవాలని వినతి

సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండే తమ సంట భూములను సోలార్ పరిశ్రమకు ఇవ్వకుండా నిలుపుదల చేయాలని కోరుతూ జగన్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలను సావధానంగా విన్న జగన్, అన్నదాతలకు వైసీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, భూముల పరిరక్షణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ ఇచ్చిన హామీతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కరేడు గ్రామ రైతులు గత కొంతకాలంగా తమ భూములను ఇండోసోల్ పరిశ్రమకు కేటాయించడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వడంతో వారు భగ్గుమన్నారు. అప్పటినుంచి వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే వారు జగన్ ను కలిశారు. జగన్ ను కలిసిన సమయంలో రైతుల వెంట కందుకూరు అసెంబ్లీ స్థానం వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడారు. "రెండు మూడు నెలలుగా ఈ భూముల గురించి రైతులు పోరాడుతున్నారు. ఏడాదికి రెండు పంటలు పండే భూములు వారి నుంచి లాక్కునే ప్రయత్నం జరుగుతుంది. రైతులు తమ గోడు జగన్ గారిని కలిసి చెప్పుకున్నారు. ఇండోసోల్ కంపెనీకి మా ప్రభుత్వ హయాంలో మరో చోట భూములు కేటాయించాం. కానీ మేం కేటాయించిన చోట కాకుండా, ఇండోసోల్ కంపెనీకి ఈ కూటమి ప్రభుత్వం కరేడు వద్ద భూములు కేటాయించింది. దీనిని మేం వ్యతిరేకిస్తాం అని జగన్ గారు చెప్పారు. ఇది అన్యాయమన్నారు. రైతులను ఇబ్బంది పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సారవంతమైన భూములు రైతులకే చెందాలి కానీ, ఇలాంటి భూములు ఇవ్వకూడదన్నారు. సాగుకు నిరుపయోగం అయిన భూములు ఇస్తే ఎలాంటి అభ్యంతరం లేదని జగన్ గారు చెప్పారు" అని వివరించారు.

## కవిత కాంగ్రెస్ లో చేరేందుకు రంగం సిద్ధమైంది: తీన్మార్ మల్లన్న

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మధ్య అనధికారిక ఒప్పందం నడుస్తోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. ఇటీవల ముగ్గురు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు... మంత్రిగా ప్రమాణం చేసే అవకాశం కవితకు వచ్చిందని... ఇది నిజమో కాదో కాంగ్రెస్ పెద్దలే చెప్పాలని అన్నారు. అగ్రకులాల వాళ్లంతా ఏకమై తమపై (బీసీలు) దాడి చేయాలని చూస్తున్నారని తీన్మార్ మల్లన్న ఆరోపించారు. బీసీలందరూ ఏకమై రాజకీయ పార్టీగా ముందుకొస్తామని... రాష్ట్రంలో అధికారాన్ని చేపడతామని చెప్పారు. రాష్ట్రంలో బీసీలంతా ఒకవైపు... కల్వకుంట్ల కుటుంబం మరోవైపు అని అన్నారు. తన మీద వారి మనుషులను ఉసిగొలిపి తనపై కవిత హత్యాయత్నం చేశారని మండిపడ్డారు. తన మీద, తన కార్యాలయం మీద దాడి చేసిన సుజిత్ రావు కవిత బంధువేనని చెప్పారు. తనపై జరిగిన దాడిని బీఆర్ఎస్ నేతలు కూడా స్వాగతించలేదని అన్నారు. కానీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర కాంగ్రెస్ పెద్దలు ప్రెస్ మీట్ పెట్టి కవితకు మద్దతుగా మాట్లాడారని విమర్శించారు. మరోవైపు తీన్మార్ మల్లన్నకు 'వై ప్లస్ కేటగిరీ' భద్రతను కల్పించాలని మున్నూరు కాపు సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఆయనపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్టు ఐక్య వేదిక నేతలు తెలిపారు.

# విద్యార్థుల మరణాలకు రేవంత్ బాధ్యత వహించాలి

హైదరాబాద్: రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రేవంత్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలో వేలాది మంది విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్ తో అనారోగ్యం పాలయ్యారని, వందకు పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ కూడా ఆయన చేతిలోనే ఉన్నప్పటికీ ఇంతవరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని విమర్శించారు. కనీసం ఒక తండ్రిగానైనా రేవంత్ స్పందించాలని... పిల్లలు కలిగిన ఒక తండ్రిగా కోరుతున్నానని కేటీఆర్ అన్నారు. మీ పిల్లలకు విషం కలిపిన ఆహారాన్ని ప్రభుత్వం పెడితే మీరు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సరైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని... తగిన సమయంలో తీర్పు ఇస్తారని చెప్పారు.

## లెక్చరర్ వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య...
# బీజేపీపై రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు



ఢిల్లీ: ఒడిశా బాలేశ్వర్ లోని ఫకీర్ మోహన్ కాలేజీలో బీఈడీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని లెక్చరర్ వేధింపులు భరించలేక కాలేజీ ప్రాంగణంలో నిప్పంటించుకున్న సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ఆమె ప్రాణాలు విడిచింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ... ఇది ఆత్మహత్య కాదని, బీజేపీ చేసిన వ్యవస్థీకృత హత్య అని అన్నారు. బాధితురాలిని రక్షించడంలో ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. న్యాయం కోసం, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా బాధిత విద్యార్థిని ధైర్యంగా పోరాడిందని రాహుల్ అన్నారు. ఆమెకు న్యాయం చేయడానికి బదులు... అవమానించి, బెదిరించి, హింసించారని మండిపడ్డారు. నిందితుడిని కాపాడేందుకు బీజేపీ వ్యవస్థ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ఒక అమాయకురాలైన విద్యార్థిని తనకు తానుగా నిప్పంటించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కుమార్తెలు ప్రాణాలు కోల్పోతున్నా... మీరు ఇంకా మౌనంగానే ఉన్నారా? అని ప్రశ్నించారు. దేశానికి మీ మౌనం అవసరం లేదని... తమ ప్రశ్నలకు సమాధానాలు కావాలని అన్నారు. మహిళలకు భద్రత, న్యాయం కావాలని చెప్పారు. ఘటన వివరాల్లోకి వెళితే... బాధిత విద్యార్థినిని లెక్చరర్ సమీర్ సాహు కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనకు లొంగకపోతే భవిష్యత్తును నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఆయన వేధింపులు భరించలేని బాధితురాలు గత నెల 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన కాలేజీ యాజమాన్యం... ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో, తీవ్ర మనోవేదనకు గురైన బాధితురాలు 12వ తేదీన కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయానికి ఒక్కసారిగా పరిగెత్తి అక్కడే ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తోటి విద్యార్థులు ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. బాధితురాలిని సమీప ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న అర్ధరాత్రి ప్రాణాలు కోల్పోయింది.

# ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశం...




ఓటరు జాబితాల్లోని లోపాలను సరిచేయాలన్న ఎన్నికల సంఘం లక్ష్యాన్ని స్వాగతించారు. కేంద్ర ఎన్నికల సంఘంపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపులో ఆధార్‌ను ఏకైక ఆధారంగా పరిగణించకూడదని సూచించిన టీడీపీ, 11 రకాల గుర్తింపు పత్రాలను అంగీకరించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతించింది.

ఆధునిక సాంకేతికత వినియోగం, డూప్లికేట్ ఓట్ల తొలగింపు

డూప్లికేట్ ఓటర్లను తొలగించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ఆధునిక సాంకేతికతను వినియోగించాలని పల్లా శ్రీనివాస రావు సూచించారు. ప్రతి ఓటరుకు ప్రత్యేక డోర్ నంబర్ కేటాయించడం ద్వారా డేటా చోరీని నిరోధించి, యూనిక్ ఓటర్ ఐడెంటిటీని సృష్టించవచ్చని ఆయన పేర్కొన్నారు.

పౌరసత్వ నిర్ధారణపై సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తావన

ఓటరు జాబితా పరిశీలనలో ఎన్నికల సంఘానికి ప్రత్యేక హక్కులు ఉన్నప్పటికీ, పౌరసత్వ నిర్ధారణ వారి అధికార పరిధిలో లేదని, 1995 సుప్రీంకోర్టు లాల్ బాబు హుస్సేన్ కేసు తీర్పును ఆయన గుర్తు చేశారు. అభ్యంతరాలు లేవనెత్తిన వారే ఆధారాలు సమర్పించాలని, ఆధారాలు చూపలేకపోయినంత మాత్రాన ఓటర్ల హక్కును రద్దు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

బీహార్‌లో తొలగింపు ప్రక్రియపై ఆందోళన

బీహార్‌లో ఓటర్ల తొలగింపు ప్రక్రియ కారణంగా గందరగోళం నెలకొందని, గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటం, ఆధార్ ఉన్నా ఇతర పత్రాలు లేని వారు ఎక్కువగా ఉండటం వల్ల నిజమైన ఓటర్లు తొలగింపుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్‌లో సుమారు 3 కోట్ల మంది ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం ఆర్టికల్ 326కు విరుద్ధమని, గుర్తింపు పత్రాలు లేని వారు భారతీయులేనని నిర్ధారించే బాధ్యత ప్రభుత్వ సంస్థలదేనని ఆయన అన్నారు.

టీడీపీ సిఫార్సులు...

టీడీపీ తరఫున పల్లా శ్రీనివాస రావు, ఓటర్లకు అన్యాయం జరగకుండా న్యాయపరమైన, పారదర్శకమైన విధానాలను అమలు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ముఖ్యంగా:

డ్రాఫ్ట్ ఓటరు జాబితాలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలి. ఫీల్డ్ లెవెల్ అధికారుల నియామకంలో పారదర్శకతను నిర్వహించాలి. వాలంటీర్ వ్యవస్థలు, మొబైల్ వాహనాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పత్రాల సేకరణకు ప్రభుత్వం సహాయం అందించాలి. వాట్సాప్ హెల్ప్‌లైన్లు, వార్డు స్థాయి సమస్యా పరిష్కార విధానాలు సమర్థవంతంగా పనిచేయాలి. పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులను అన్ని దశల్లో భాగస్వామ్యం చేయాలి. ప్రతి పౌరుని ఓటు హక్కును కాపాడేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలి. బూత్ లెవెల్ అధికారులకు ప్రస్తుతం అందిస్తున్న రూ.250 ప్రోత్సాహకాన్ని పెంచాలి. బూత్ లెవెల్ ఏజెంట్లు, బీఎల్వోలు సమన్వయంతో పనిచేస్తే పని మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుంది. ఈ సమావేశంలో తెలుగుదేశం తరఫున పల్లా శ్రీనివాస రావుతోపాటు పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, శబరి, కూన రవికుమార్, జ్యోత్స్న పాల్గొన్నారు.

# రూ. లక్ష కోట్ల పెట్టుబడులకు 95 సంస్థలు ముందుకువచ్చాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ద్వారా 10 లక్షల ఉద్యోగాలను సృష్టించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ లక్ష్యాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, జీసీసీలు, డేటా సెంటర్ల స్థాపనకు ఇప్పటివరకు 95 ప్రముఖ సంస్థలు రూ. లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని మంత్రి తెలిపారు. ఈ సంస్థలు త్వరితగతిన తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూకేటాయింపులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించగా, ఈ సంస్థలు త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని లోకేశ్ సూచించారు. ఇటీవలి బెంగళూరు పర్యటనలో ఏఎన్ఎస్ఆర్, సత్వ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయని, వీటి ద్వారానే యువతకు 35,000 ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎంఓయూలు చేసుకున్న సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ యూనిట్లు ఏర్పాటు చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం 26 జిల్లా కేంద్రాల్లో కో-వర్కింగ్ స్పేస్‌లను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

త్వరలోనే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

రాష్ట్రంలో నవీన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి తలపెట్టిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. దీంతో పాటు విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ప్రాంతీయ స్పోక్స్ కేంద్రాలను కూడా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి సంబంధించి టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐబీఎంల భాగస్వామ్యంతో కంపెనీ ఏర్పాటైందని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 400 ఎకరాల్లో నిర్మించదలపెట్టిన డ్రోన్ సిటీని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన ఎకో సిస్టమ్ కల్పించాలని అధికారులను ఆదేశించారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్‌ల సేవలు ఎంతగానో ఉపకరించాయని, వ్యవసాయం, పోలీసింగ్, వాతావరణం తదితర శాఖల్లో డ్రోన్‌ల వినియోగంపై నెలకు ఒక జిల్లాలో ఈవెంట్లు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు.

మనమిత్ర సేవలు మరింత సులభతరం

పౌరసేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను మరింత విస్తృతపరచాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మొత్తం 702 సేవలలో 535 సేవలను ఇప్పటికే మనమిత్ర ద్వారా అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి చెక్ పెట్టాలని, కుల ధృవీకరణ పత్రంతో సహా విద్యాసంబంధిత అన్ని రకాల సర్టిఫికెట్లు బ్లాక్ చైన్‌తో అనుసంధానం చేసి మనమిత్ర ద్వారా సులభతరంగా పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని 45,000 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి స్కూలుకు ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి వంటి ఎయిర్‌పోర్టుల్లో అంతరాయం లేని ఫోన్ కనెక్టివిటీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐటీ అండ్ సీ స్పెషల్ సెక్రటరీ సుందర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సాయికాంత్ వర్మ, ఆర్టీజీఎస్ సీఓ ప్రకార్ జైన్, ఏపీటీఎస్ ఎండీ సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం కేసు.. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి
# హైకోర్టులో ఎదురుదెబ్బ




అమరావతి: మద్యం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి కి హైకోర్టు లో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో మిథున్‌రెడ్డి ఏ4 నిందితుడిగా ఉన్నారు. రాష్ట్రంలో మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థ గతంలో ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఉండేదని, వైకాపా ప్రభుత్వ హయాంలో దానిని మాన్యువల్ విధానంలోకి తీసుకురావడంలో ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ4) కీలక పాత్ర పోషించారని సీఐడీ/సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో గురువారం వాదనలు వినిపించారు. తద్వారా లావాదేవీలను తన నియంత్రణలోకి తీసుకున్నారన్నారు. ముడుపులు అందిన కంపెనీలకే మద్యం సరఫరా అనుమతులిచ్చారని తెలిపారు. మద్యం కుంభకోణం ద్వారా ఖజానాకు రూ.3,500 కోట్ల నష్టం జరిగిందన్నారు. ఆ సొమ్మును మళ్లించడంలో మిథున్‌రెడ్డి పాత్ర కీలకమని చెప్పారు. ఈ కుంభకోణానికి వ్యూహరచన, అమలులో మిథున్‌రెడ్డి 'మాస్టర్ మైండ్' అంటూ సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని, అందుకు ఆధారాలు లభించాయని తెలిపారు. ఎంపీ పదవిని దుర్వినియోగం చేశారని.. దర్యాప్తునకు సహకరించడం లేదని వివరించారు. మిథున్‌రెడ్డికి నేర చరిత్ర ఉందని, ఆయనపై 8 కేసులు నమోదయ్యాయని చెప్పారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంతో పిటిషనర్‌కు సంబంధం లేదని వాదించారు. షరతులతో ముందస్తు బెయిలివ్వాలని కోరారు. ఇటీవల వాదనలు ముగించిన హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ నేపథ్యంలో మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది.

## సీబీ అదుపులో తెలంగాణ నీటి పారుదల శాఖ
# మాజీ ఈఎన్‌సీ మురళీధర్ రావు



హైదరాబాద్: తెలంగాణ నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా బాధ్యతలు నిర్వహించిన విశ్రాంత ఇంజినీరింగ్ అధికారి మురళీధర్‌రావును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్‌తో పాటు మురళీధర్ రావు బంధువులు, సన్నిహితుల నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మురళీధర్ రావు ఇరిగేషన్ శాఖలో చక్రం తిప్పి పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. కాళేశ్వరం, మేడిగడ్డ అవినీతి, అవకతవకల్లో కూడా మురళీధర్ రావుది కీలక పాత్ర అని ప్రస్తుత ప్రభుత్వం అనుమానిస్తోంది. ఇరిగేషన్ శాఖలో అవినీతిపై ఇప్పటికే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అనేక మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. విజిలెన్స్ శాఖ క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేసిన 17 మందిలో మురళీధర్ రావు కూడా ఉన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ అవినీతి అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు మురళీధర్ రావు ఇంతకు ముందు విచారణకు హాజరయ్యారు. వాస్తవానికి ఈఎన్‌సీ జనరల్‌గా కీలకంగా వ్యవహరించిన మురళీధర్ రావు ఉమ్మడి రాష్ట్రంలోనే పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత మురళీధర్ రావు పదవీ కాలాన్ని 13 ఏళ్ల పాటు పొడిగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆయన కొన్నాళ్లు పదవిలో ఉన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక వచ్చిన తర్వాత మురళీధర్ రావును రేవంత్ సర్కార్ తొలగించింది.

## నేడు ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశం..
# కేంద్రానికి తెలంగాణ కీలక లేఖ

హైదరాబాద్: గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. ఈ అంశంపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నుండి రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే రేపటి సమావేశంలో బనకచర్లపై చర్చ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం ఆ లేఖలో స్పష్టం చేసింది. కృష్ణా నదిపై పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులను అజెండాగా ప్రతిపాదించింది. పాలమూరు, దిండి ప్రాజెక్టులకు జాతీయ హోదా, ఇచ్చంపల్లి ప్రాజెక్టును కేంద్రం చేపట్టాలని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టీఎంసీలు కేటాయించాలని అజెండాగా పంపించింది. ఏపీ ఇచ్చిన బనకచర్ల అజెండాపై తెలంగాణ అభ్యంతరం తెలిపింది. బనకచర్లకు ఎలాంటి అనుమతులు లేవని, చట్టాలు, ట్రైబ్యునల్ తీర్పుల ఉల్లంఘన జరుగుతోందని ఆ లేఖలో ప్రస్తావించింది. గోదావరి - బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చించడం అనుచితమని పేర్కొంది. ఇలాంటి చర్యలతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలపై నమ్మకం పోతుందని పేర్కొంది. కాగా, గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డిలతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ రేపు సమావేశం కానున్నారు. ఈ మేరకు జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కార్యాలయాలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సమాచారం పంపించింది. ఢిల్లీలోని జలశక్తి ప్రధాన కార్యాలయం శ్రమశక్తి భవన్‌లో మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఈ సమావేశం జరగనుంది. ఈ అంశంతో పాటు ఏమైనా అజెండా అంశాలు ఉంటే పంపించాలని జలశక్తి శాఖ కోరింది.

# తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నది మా ఆలోచన

మొదటి పేజి తరువాయి

అందులో తెలంగాణ నుంచి 10 శాతం మేరకు కంట్రిబ్యూట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిర్దేశిత గడువు నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంతో పెట్టుకున్నాం. బల్క్ డ్రగ్స్, వాక్సిన్ల తయారీలో ప్రపంచంలోనే తెలంగాణకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయంటే ఇక్కడి పారిశ్రామిక వేత్తల కృషి ఎంతో ఉంది. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని బయపెడుతున్న సమయంలో జినోమ్ వ్యాలీ నుంచే వ్యాక్సీన్లు తయారు చేసి దాదాపు వంద దేశాలకు సరఫరా చేసిన సందర్భం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. ఈరోజు దేశంలో 33 శాతం వ్యాక్సీన్లు తెలంగాణ నుంచి ఉత్పత్తి అవుతుండగా, 40 శాతం మేరకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తు చేస్తున్నామంటే ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టిన వారు ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. ఈ మధ్య కాలంలో బయో, ఫార్మసీ రంగంలో కూడా ప్రపంచంలోని అత్యాధునిక విధానాలు అవలంభిస్తున్న పరిశ్రమలను అహ్వానించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. జినోమ్ వ్యాలీ పెట్టుబడుదారులకు స్వాగతం పలుకుతున్నాం. ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ప్రోత్సాహకాలను అందిస్తుంది. మీ మద్దతు కావాలి. పెట్టుబడులు పెట్టండి.." అని ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు గారు ఐకార్ లోగో ఆవిష్కరించగా, మంత్రి వివేక్ గారు వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

## ఏపీలో నాణ్యమైన మద్యం అమ్మకాలు జరగాలి

తద్వారా రాష్ట్రం ఆదాయం కోల్పోయిందని అన్నారు. అదే సమయంలో ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతిందని సీఎం అన్నారు. 2014 నుంచి 19 మధ్య అమలైన మద్యం పాలసీ ఎలా ఉంది, గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధానంపై అధ్యయనం చేసి నివేదికను ప్రజల ముందు ఉంచాలని సీఎం స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసిన నూతన మద్యం పాలసీతో ఏపీ రెవెన్యూ పెరిగిందని స్పష్టం చేశారు. గతంలో పొరుగు రాష్ట్రాలకు తరలిపోయిన ఆదాయం ఇప్పుడు రికవరీ అయిందని అన్నారు. గతంలో జే బ్రాండ్ల కారణంగా గంజాయికి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, ప్రజారోగ్యంపై తీవ్రంగా ప్రభావం పడిందని అన్నారు. అలాగే స్వార్థం కోసం గత పాలకులు తెచ్చిన సొంత బ్రాండ్లు ఇప్పుడు కనిపించకుండా పోయాయని, ప్రజలు కూడా దీన్ని గుర్తించారని అన్నారు.

మార్కెట్లో ఉన్నవి ప్రముఖ బ్రాండ్లే

గత ప్రభుత్వ హయాంలో విక్రయించిన నకిలీ మద్యం బ్రాండ్లను ఎంత వరకు అరికట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాసిరకమైన బ్రాండ్లు ఇంకా ఏమైనా మార్కెట్‌లో కొనసాగుతున్నాయా అని సీఎం ఆరా తీశారు. గతంలో విస్తృత స్థాయిలో విక్రయించిన అనామక మద్యం బ్రాండ్లు నూతన పాలసీ అమలుతో పూర్తిగా తగ్గినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అన్ని ప్రముఖ బ్రాండ్లు ఇప్పుడు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. గతంలో మార్కెట్లో 68 శాతం మేర అనామక బ్రాండ్లకు చెందిన మద్యమే అందుబాటులో ఉండేదని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ నాసిరకం బ్రాండ్ల విక్రయం జరగకుండా చూస్తున్నామని అధికారులు సీఎంకు తెలియచేశారు. దేశీయ, విదేశీ కంపెనీలకు చెందిన ప్రముఖ బ్రాండ్లన్నీ ఏపీ మార్కెట్‌లో కొనుగోలుదారులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

చరిత్రలో తొలిసారి తగ్గిన మద్యం ధరలు

పేద ప్రజల జేబులు కొల్లగొట్టేలా ప్రభుత్వం వ్యవహరించకూడదు, దోపిడీ ఉండకూడదు అనే ఉద్దేశ్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా మద్యం ధరలు తగ్గించామని సీఎం అన్నారు. ఈ కారణంగా ప్రతీ నెలా కొనుగోలుదారులపై రూ. 116 కోట్ల రూపాయల మేర భారం తగ్గుతుందని అధికారులు తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పోలిస్తే ఏపీలో విక్రయిస్తున్న టాప్ 30 బ్రాండ్ల మద్యం ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. మరోవైపు పర్మిట్ రూమ్ లను అనుమతించే అంశంపై కమిటీ అధ్యయనం చేసిన అనంతరం నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పర్మిట్ రూమ్లు లేకపోవడం వల్ల ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతున్నారని, ఇది సమస్యలకు కారణం అవుతుందని అధికారులు వివరించారు. దీన్ని నివారించేందుకు పెద్ద ఎత్తున కేసులు నమోదు చేస్తున్నా, పూర్తిగా నివారించలేకపోతున్నామని, పర్మిట్ రూమ్లు ఇచ్చి అక్కడి వరకే పరిమితం చేస్తే మంచిదని అధికారులు వివరించారు. అలాగే పర్యాటక రంగానికి ఊతమిచ్చేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లోనూ మైక్రో బ్రూవరీలను అనుమతించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఎక్సైజ్ ఐ ద్వారా డేగకన్ను పెట్టండి.. ః అబ్కారీ శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అమలు చేసి ట్రేస్ అండ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిస్టిలరీల నుంచి బెవరేజెస్ కార్పోరేషన్ వరకూ అలాగే దుకాణాల వరకూ వాహనాల కదలికలపై రియల్ టైమ్ లో ట్రాకింగ్ మెకానిజం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీపీఎస్ పరికరాల ద్వారా మానిటర్ చేయాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే ఆన్‌లైన్ నగదు లావాదేవీలను ప్రోత్సహించాలని, డిజిటల్ లావాదేవీల విషయంలో ఎక్కడా రాజీ లేకుండా చూడాలని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్ దుకాణాలు ఉండడానికి వీల్లేదని సీఎం తేల్చి చెప్పారు. డేటా అనలటిక్స్ ద్వారా ఎప్పటికప్పుడు దుకాణాల్లోని స్టాక్స్‌పై కూడా అంచనాకు రావాలని పేర్కొన్నారు. బెల్లపు ఊట, నాటు సారా తయారీ లాంటి వాటిపై డ్రోన్స్‌తో నియంత్రణ సాధించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయ వ్యవస్థాపకుడు తలారి పరుశురాం మృతి



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 16 (శుభోదయం న్యూస్): శ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయం వ్యవస్థాపకుడు తలారి పరుశురాం మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు మంచికి మారుపేరుగా గర్వం లేని వ్యక్తిగా అందర్నీ ఆప్యాయంగా పలకరించే తలారి పరుశురాం గతంలో రాజకీయాల్లో కూడా చురుకైన పాత్ర పోషించారు కరోనా సమయంలో కూడా పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు అందరివాడుగా మన్ననలు అందుకున్నారు.

# ప్రదీప్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గుంతకల్ వైసీపీ నాయకులు



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 16 (శుభోదయం న్యూస్) : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు మంత్రాలయం నియోజకవర్గం యువ నాయకులు వై. ప్రదీప్ రెడ్డిని మంగళవారంమర్యాదగాపూర్వకంగా కలిసి శ్రీ కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి తీర్థ ప్రసాదాలు అందజేసిన గుంతకల్ మండలం సర్పంచులు ఫోరం అధ్యక్షుడు రమేష్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కసాపురం సోమిరెడ్డి గుంతకల్ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ జయరామిరెడ్డి పోలింగ్ బూత్ మండల కన్వీనర్ నాగిరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు వాల్మీకిఅశోక, నల్లదాసరిపల్లి రాజారెడ్డి.

## రిటైర్డ్ ప్రిన్సిపాల్ పరామర్శించిన

# పోతిరెడ్డి నాగార్జున్ రెడ్డి...



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): పోరుమామిళ్ల మండలం పోరుమామిళ్ల గ్రామంలోని తురకకోటలో ఉన్న షేక్ మౌలాలి.రిటైర్డ్ ప్రిన్సిపాల్ వద్దమాను చిదానందం పాలిటెక్నికల్ కాలేజ్. బద్వేల్. ఇటీవల గుండెకు సంబంధించిన మేజర్ ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చిన సందర్భంగా. మాజీ ప్రభుత్వ సలహా పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఆయన ఇంటికి పోయి ఆయన ఆరోగ్యం పరిస్థితులను అడిగి తెలుసుకోవడం జరిగింది ఈ సందర్భంగా నాగార్జున్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాలుగా పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తూ మంచి సౌమ్య నిగా పేరు తెచ్చుకోవడం జరిగింది అతను తొందరగా కోలుకోవాలని ఆయన తెలిపారు. వారి వెంట షేక్ హుస్సేన్ పీరా. పోరుమామిళ్ల గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్. సుబ్బయ్య గురయ్యా ఓబయ్య.పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగుపడిన వైద్యసేవలు

## ఎంపీ పుట్టా మహేష్ కుమార్



జంగారెడ్డిగూడెం - డివిజన్ ఇంచార్జ్ -జులై 15 (శుభోదయం న్యూస్): ఇటీవల జరిగిన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో సమీక్షించిన అనంతరం ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగు పడ్డాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కేంద్రాన్ని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మంగళవారం సందర్శించారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందుతున్న సేవలను ఎంపీ మహేష్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధిని విస్మరించిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంపై దృష్టి సారించినట్లు ఎంపీ మహేష్ కుమార్ స్పష్టం చేశారు. అత్యాధునిక వైద్య సేవలు అందించడానికి వీలుగా ఆసుపత్రికి పరికరాలు సమకూరుస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ప్రధానంగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందించడానికి తాను వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఎంపీ వెల్లడించారు. తలసేమియా రోగులకు రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా చక్కటి సేవలు అందుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు బాగున్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. ఆస్పత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ఎంతో కృషి చేస్తున్నారని, ఆయనకు తన వంతు సహకారం అందిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రకటించారు.

# పేకాట శిబిరంపై దాడి ఎనిమిది మంది అరెస్ట్



జంగారెడ్డిగూడెం- డివిజన్ ఇంచార్జ్ =జులై 15 (శుభోదయం న్యూస్): టీ.నరసాపురం మండలం వల్లంపట్ల పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామ శివారులో పోలీసులు పేకాట శిబిరం పై దాడులు నిర్వహించి 8 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి రూ.40,500 రూపాయలు నగదు మరియు 12 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నరు. పోలవరం డిఎస్పి ఎం. వెంకటేశ్వరరావు, జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ బి వెంకటేశ్వరరావు యొక్క ఆదేశాలపై. ఈరోజు మంగళవారం మధ్యాహ్నం సుమారు 12:00 గం.ల సమయంలో, టీ.నరసాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీ ఎం. జయబాబుకి రాబడిన సమాచారం పై ఎస్ఐ వారి యొక్క సిబ్బందితో కలిసి టీ.నరసాపురం మండలం, వల్లంపట్ల పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామ శివారులో ఉన్న పేకాట శిబిరం పై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.40,500/- నగదు, 12 మోటార్ సైకిళ్లు, మరియు పేక ముక్కలు స్వాధీనం చేసుకొని, సంబంధిత వారిపై కేసు నమోదు చేసినారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయ బాబు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు టీ.నరసాపురంలో తావులేదని, పేకాట, గ్యాంబ్లింగ్ వంటి చట్టవ్యతిరేక చర్యలపై నిరంతరం దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. యువత అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లకుండా జాగ్రత్త పడాలని, ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని ప్రజలకు సూచించారు. పౌరులు తమ గ్రామాల్లో జరుగుతున్న అన్యాయమైన, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి, సమాచారం అందించిన వారి యొక్క వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా టీ నరసాపురం ఎస్ఐ తెలియ చేసినారు.

# భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలి...



బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ - శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామ రెవెన్యూ పొలంలో కమ్మవారిపల్లి గ్రామనివాసి, రంగసముద్రం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు చెరుకూరి వీరచెంద్రా యుడు భూ ఆక్రమణపై సమగ్రమైన విచా రణ చేపట్టాలని వైస్సార్సీపి జిల్లా కార్య దర్శి చాపాటి లక్ష్మినారాయణ రెడ్డి తహ శీల్దార్ చంద్రశేఖర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగాఆయనమాట్లాడుతూకోట్లరూపాయలతో కాంట్రాక్ట్ పను లు చేసే క్లాస్ -1 కాంట్రాక్టర్ తెల్లరేషన్ కార్డు లేని చెరుకూరి వీర చెంద్రాయుడు కీ 2017లో ఎలా డికేటి పట్టా మంజూరు చేశారనిప్రశ్నించారు. రంగసముద్రంగ్రామరెవెన్యూపొలం సర్వేనెంబర్ 75 లో విస్తీర్ణం 3.22ఎకరాలుడికేటిపట్టా భూమి వారికీ ఎలా సంక్రమించిందన్నారు. సర్వే నెంబర్ 62 లో 0.80 సెంట్లు. సర్వేనెంబర్ 63లో3.50 ఎకరాలు 10-10-2012నుంచి2019 సంవ త్సరం వరకు చెరుకూరి చెన్నకృష్ణయ్య తండ్రి చెన్న కేశవులు పేరుతోఆన్ లైన్, అడంగల్,1బి,వెబ్ ల్యాండ్ నందునమోదై ఉంది.04-07-2019 లో చాటకొండు నాగ రాజు తండ్రి సూరయ్య పేరుతో ఆన్ లైన్ నందు నమోదైంది.2019 నుండి 2021 లో (14-04-2021లో) చాటకొండు నాగ రాజు తండ్రి సూరయ్య పేరుతో ఎన్ఓసి కాపీలు కలెక్టర్ ఆర్డర్ మేరకు రిలీజ్ కావ డం,బద్వేల్ సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు రిజిష్టర్ చేయడం జరిగిందన్నారు. కానీఆర్మీ రిజర్వేషన్ పట్టా ఎన్ఓసి చేయా లంటే పది సంవత్సరములఅనుభవం ఉండిఉండాలి. ఇది ఎలా సాధ్యం.దీనిపై సమగ్ర విచారణ చేసి దోషులపై పొలిసు చర్యలు తీసుకోవాలన్నారు.సర్వే నెంబర్ 136-5 లో విస్తీర్ణం 5-00 ఎకరాలుసి.నాగ రాజు తండ్రి సూరయ్య పేరుతో ఆన్ లైన్ వెబ్ ల్యాండ్,మ్యానువల్ అడంగల్,1బి నందు నమోదు అయి ఉన్నది.ఇది కూడా ఆర్మీ రిజర్వేషన్ కలిగిన పట్టానే.అయితే ఒకే వ్యక్తికీ ఆర్మీ కోటలో రెండు సార్లుపట్టా లు ఇవ్వవచ్చా ?ఇతనికి మొదట సర్వే నెంబర్ 62లో 0.80 సెంట్లు. సర్వేనెంబర్ 63 లో 3.50 ఎకరాలు,మళ్ళిసర్వేనెంబర్ 136-5 లో విస్తీర్ణం 5-00 ఎకరాలు ఎలా ఇస్తారు.దీనిపైన ,నాగరాజు పైన సమగ్ర పొలిసు విచారణ చేస్తే వాస్తవాలు వెలుగు లోకి వస్తాయన్నారు.పోరుమామిళ్ల చెరు వు నుంచి రంగసముద్రం చెరువులోకి సాగునీటి కోసం తీసిన పంట కాలువల వెడల్పు,పొడవులు రికార్డులమేరకుఎంత ఉన్నాయి.ప్రస్తుతం ఎంత వెడల్పు ఉంది. దానిని పూడ్చి అక్రమంగా నిర్మాణాలుచేస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.ఈ కాలువ పై శ్రీ చైతన్య స్కూల్ దగ్గర నుండి చెరుకూరి చెంద్రాయుడు లాడ్జిదగ్గరవరకు ఏకంగా రూములు కట్టివ్యాపారాలుచేస్తూ బాడుగలు వసూలు చేస్తున్నారు. దీనిపైన సమగ్ర పొలిసు చర్యలు తీసుకోవాల న్నారు.

# విజన్ యాక్షన్ ప్లాన్ సమీక్షా సమావేశం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్




జంగారెడ్డిగూడెం- డివిజన్ ఇంచార్జ్ - జూలై 15 (శుభోదయం న్యూస్): జిల్లా స్థూల ఉత్పత్తిని రెట్టింపు చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి- విజన్ యాక్షన్ ప్లాన్ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్.. జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేసేందుకు 50 నుండి 100 ఎకరాల భూమిని వెంటనే గుర్తించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు ఏలూరు జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ లపై అధికారులతో మంత్రి సమీక్షించారు. జిల్లా కలెక్టర్



సెల్వి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), సొంగా రోషన్ కుమార్, మద్దిపాటి వెంకటరాజు, ఎస్పీ కె. పి.ఎస్. కిషోర్, జేసి పి. ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాల మేరకు స్వర్ణాంధ్రఏ2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ లను ఏటా 15 వృద్ధిరేటు లక్ష్యంతో జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, వచ్చే సమావేశం నాటికి విజన్ యాక్షన్ ప్లాన్ తుది ప్రణాలికను స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో సిద్ధంచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి, ప్రధాన నగరం విజయవాడ ఏలూరు నగరానికి దగ్గరలో ఉండడం, జాతీయ రహదారి, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండడంతో పారిశ్రామికవేత్తలు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు మొగ్గు చూపుతున్నారని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన మంచి వాతావరణాన్ని కల్పించి,, పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను గుర్తించడంతోపాటు, ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించినట్లయితే పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకువస్తారన్నారు. పరిశ్రమల స్థాపనతో స్థానిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని, జిల్లా స్థూల ఉత్పత్తి మరింత పెరుగుతుందన్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఆక్వా, ఉద్యానవనాలు రంగాలలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనతో జిల్లా స్థూల ఉత్పత్తిని రెట్టింపు చేసేలా వివిధ శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో స్థూల ఉత్పత్తి 72 వేల 314 కోట్ల రూపాయలు కాగా, అందులో 60 శాతం వ్యవసాయం, 35 శాతం ఆక్వా, 19 శాతం ఉద్యానవనాలు నుండి వస్తుందన్నారు. జిలాల్లో ఆయిల్ పామ్ విస్తరణకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, క్రాప్ డైవర్షన్ పథకం కింద మరింత విస్తీర్ణంతో ఆయిల్ పామ్ సాగు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిలాల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని, పంచాయతీ రాజ్, రహదారులు, భవనాల శాఖకు అదనంగా నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఏలూరు నగరం పరిసరాలలో ఎన్నో ఇంజనీరింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు ఉన్నాయని, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ తో సేవా రంగంలో పెద్దఎత్తున సంస్థలు ఏర్పాటుచేయవచ్చన్నారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పాలన సాగించాలన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా , లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా మండల స్థాయిలో సమీక్ష చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. పాడి పశువుల కొనుగోలుకు రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ లోన్లపై అవగాహన కలిగించాలని, ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, ప్రతీ పాడి రైతు ప్రభుత్వ పథకాలు సదివినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి ఆయా గ్రామాలలో రోడ్లు, త్రాగునీరు, విద్యుత్, డ్రైనేజి వంటి ప్రాథమిక సదుపాయాల కల్పలనపై చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 100 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల లక్ష్యానికిగాను ఇప్పటివరకు 27 యూనిట్లు ఏర్పాటుచేశామని, నూజివీడులో పెద్దతరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని, మిగిలినవి నిర్దేశించిన సమయంలోగా ఏర్పాటుచేస్తామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుచేయడం జరిగిందని, మిగిలిన నియోజకవర్గాలలో త్వరలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుత ఏడాదిలో 40 వేల ఎకరాలలో ప్రకృతి సాగును అమలు చేస్తున్నామని, ఆయిల్ పామ్ పంటను మరో 13 వేల హెక్టార్లలో విస్తరించనున్నామన్నారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, పోలవరం.కొల్లేరు ప్రాంతాలతో పాటు టెంపుల్ టూరిజం ను కూడా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో 3 ప్రాంతాలలో ఫైవ్ స్టార్ హెూటల్స్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. జిల్లాలో ప్రాథమిక సౌకర్యాలైన రోడ్లు, గృహనిర్మాణ, త్రాగునీరుకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి కల్పిస్తున్నామని, ఉచిత గ్యాస్ పథకాన్ని నూరు శాతం అమలు చేస్తున్నామన్నారు. సౌర విద్యుత్ లో లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ ను పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ

కేంద్ర ప్రభుత్వం దేశంలో 50 ప్రాంతాలలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నదని, వాటిలో మన రాష్ట్రానికి 3 ప్రాజెక్టులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లాలో కొల్లేరు ప్రాంతాన్ని పెద్ద పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలో ఉందన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామివేత్తలకు అవసరమైన భూములు అందించేందుకు, వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్దిష్టమైన సమయాన్ని నిర్ణయించాలన్నారు. జిల్లాలో పండిన పంటలకు అధిక లాభాలు వచ్చేలా ఇక్కడే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే స్థానిక రైతాంగం లాభపడుతుందన్నారు. జిల్లాలోని కొన్ని గ్రామాలలో ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, త్రాగునీరు, అంతరాయం లేని, లో వోల్టేజ్ లేని విద్యుత్ ఆయా ప్రాంతాలకు అందించాలన్నారు. పోలవరం, కైకలూరు,పోలవరం, చింతలపూడి ప్రాంతాలలో రోడ్లు మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంచడంతోపాటు, విద్యార్థుల స్థాయిని అనుసరించి అదనపు తరగతి గదులు నిర్మాణం, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేలా చూస్తున్నామన్నారు.

ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఏలూరులో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని, వారికి పరిశ్రమల ఏర్పాటులో అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఏలూరు నియోజకవర్గంలో ఎన్నో ఇంజనీరింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు ఉన్నాయని, కోర్స్ పూర్తిచేసుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఏలూరులో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనా అటవీ శాఖ వారు అభ్యంతరాల కారణంగా చేపట్టలేకపోతున్నారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాడిపశువుల కొనుగోలుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై రైతులకు మరింత అవగాహన కలిగించాలన్నారు.

చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రవాసాంధ్రులు పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రాథమిక అవసరాలైన రోడ్లు మంజూరుచేయాలని మంత్రి కోరారు. ఈ విషయంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ చింతలపూడి నియోజకవర్గంలో పంచాయతీయరాజ్, రహదారులు, భవనాల శాఖకు సంబందించిన రోడ్ల మరమ్మత్తులు, కొత్త రోడ్ల నిర్మాణాలపై బుధవారం సాయంత్రంలోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో ఫుడ్ పార్క్ ఏర్పాటు, టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయాలనీ కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల ద్వారాల రోడ్ల నిర్మాణం, ఐ.ఎస్. జగన్నాధపురం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతాన్ని ముంపు బారినుండి రక్షించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కిక్కిస, తూడు, గుర్రపు డెక్క ను తొలగించాలని కోరారు. కొల్లేరు ప్రాంతంలో ఆక్వా రంగం అభివృద్ధికి అంతరాయం, లో వోల్టేజి లేని విద్యుత్ సరఫరాను అందించాలని కోరారు.

ఎస్పీ కె.పి .ఎస్. కిషోర్ మాట్లాడుతూ ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో పరిశ్రమల స్థాపనలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. ఏలూరు జిల్లా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు లేని ప్రాంతమని ఇటువంటి వాతావరణంలో పారిశ్రామికవేత్తలు పరిశ్రమలస్థాపనకు ముందుకు వస్తారన్నారు. అమరావతి, విజయవాడ మన జిల్లాకు దగ్గరగా ఉండడం, ఏలూరు పరిసరాలలో ఎన్నో ఇంజనీరింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు ఉండడంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్నిఏర్పాటుచేసి, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ తో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా కల్పించవచ్చన్నారు. డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బి. స్మరణ రాజ్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలు అచ్యుత్ అంబరీష్, ఎం.వి. రమణ, ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ యూనిట్ల కార్యాలయాల సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెం ముస్లిం జేపీసీ సభ్యులు కొయ్యలగూడెంలో సమావేశం




జంగారెడ్డిగూడెం - డివిజన్ ఇంచార్జ్ -జులై 15 (శుభోదయం న్యూస్): కొయ్యలగూడెం మండలం కొయ్యలగూడెం గ్రామం మస్జిద్ లో మసీదు పెద్దలతో జంగారెడ్డిగూడెం జేపీసీ సభ్యులు సమావేశం అవటం జరిగింది. ముస్లిం సమాజంలో చదువుకున్న వారు తక్కువగా ఉండటం వలన విద్య లేకపోవడం వలన అన్ని రంగాల్లో వెనకపాటు తనానికి గురి అవుతున్నారని అందువలన ప్రతి ఒక్కరూ వారి పిల్లలని కనీసం డిగ్రీ వరకు అయిన చదివించాలని జంగారెడ్డిగూడెం జేపీసీ నాయకులు షేక్ ముస్తఫా కోరారు. రాజకీయాల్లో కూడా ముస్లింలు వెనకబడి ఉన్నారని రాజకీయ ప్రాధాన్యత తక్కువగా ఉందని తెలిపారు.చాలా గ్రామాల్లో ముస్లింలు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ కనీసం రాజకీయంగా వార్డు మెంబర్లుగా కూడా గెలవలేని పరిస్థితి కొనసాగుతుందని తెలిపారు. కనుక ముస్లిం సోదరులు వారి గ్రామాల్లో ముస్లింల పిల్లలను డిగ్రీ వరకు చదివించే ప్రయత్నం చేయాలని, ఇంటింటికి తిరిగి సర్వే చేసి డేటా సేకరించాలని డ్రాప్ అవుట్ స్టూడెంట్స్ లేకుండా చూసుకోవాలని తద్వారా ముస్లిం సమాజం అభివృద్ధి చెందే అవకాశం ఉందని నాయకులకు తెలిపారు. పిల్లలను చదివించే విషయంలో జంగారెడ్డిగూడెం ముస్లిం జేపీసీ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ ముస్తఫా, షేక్ బాజీ (టిప్ టాప్) షేక్ యాకూబ్ షేక్ నజీర్ భాష షేక్ ఆదిల్, షేక్ సాజిద్, మహమ్మద్ నబీ (టీచర్) అబ్దుల్ షాహిన్, సయ్యద్ అన్వర్, షేక్ జహంగీర్, సయ్యద్ రంజాన్, షేక్ ఫరీద్, షేక్ షరీఫ్, షేక్ జిలాని, షఫీ, సయ్యద్ సమ్మీ, సయ్యద్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ కే పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన కోర్స్



Dr. A. Lakshmaiah, M.Sc.,M.Ed.,Ph.D., Principal

గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 16 (శుభోదయం న్యూస్) : ఎస్ కే బి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన కోర్సును ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ లక్ష్మయ్య ప్రారంభించారు(స్వయంప్రతిపత్తి), గుంతకల్ కామర్స్ విభాగంలో ఉద్యోగం తొ కూడిన నూతన కోర్సు ప్రారంభంస్థానిక ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), గుంతకల్ లో 2025%-%26 విద్యా సంవత్సరం నుండి కామర్స్ విభాగంలో బి.కాం(బిఎఫ్ ఎస్ ఐ)(బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) అనే 100% ఉద్యోగం గ్యారెంటి తో నూతన కోర్సు ప్రారంభించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. లక్ష్మయ్య గారు వెల్లడించారు.ఈ కోర్సు మూడు సంవత్సరాల వ్యవధి గలది. తృతీయ సంవత్సరంలో విద్యార్థులకు గుంతకల్ పరిధిలోని ప్రముఖ ప్రభుత్వ మరియు ప్రైవేట్ బ్యాంకుల్లో స్టైఫండ్‌తో కూడిన అప్రెంటిషిప్ ట్రైనింగ్ కల్పించబడతాయని పేర్కొన్నారు. కోర్సు మరియు అప్రెంటిషిప్ పూర్తి చేసిన ప్రతీ విద్యార్థులకి, ఆయా బ్యాంకుల్లోనే ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశముందని తెలియజేశారు.ఈ కొత్త కోర్సు ప్రారంభం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అనుభవంసంపాదించడంతోపాటు, బ్యాంకింగ్ మరియు ఫైనాన్షియల్ రంగాలలో నైపుణ్యాలు అభివృద్ధి చేసుకునే అవకాశముందని కళాశాల కామర్స్ విభాగం సినియర్ అధ్యాపకులు డా. యు. రాఘవేంద్ర ప్రసాద్ తెలియజేశారు.ఈ కోర్సులో ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు కామర్స్ అధ్యాపకులైన ఎన్ ఏ అల్తాఫ్ ను సంప్రదించాలని తెలియజేశారు.

## వ్యవసాయ శాఖ వారి పొలం పిలుస్తుంది కార్యక్రమం




దోర్నాల, మండల రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండలం 15.07.2025 న దోర్నాల మండలం లోని చింతల మరియు మర్రిపాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి




డి. జవహర్ లాల్ నాయక్ ముందుగా గ్రామంలో సాగు చేసిన ప్రత్తి పంటను క్షేత్ర సందర్శన చేయడం జరిగింది. అలాగే ప్రస్తుతం పత్తి పంట 30-50 రోజులలో ఉంది కాబట్టి మెగ్నీసియం లోప నివారణకు ముందుగా ఎకరానికి 1కేజీ మెగ్నీషియం సల్ఫేట్ పై పాటుగా పిచికారీ చేయాలనీ తెలియజేయడం జరిగింది. అలాగే రసం పీల్చే పురుగు నివారణకు వేప గింజల కాషాయం పిచికారీ చేయాలనీ తెలిపారు. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న అన్నదాత సుఖీభవ -%ాపీఖ×ాూచీ%, భూ సారా పరిరక్షణ పథకం, ఈ పంట ఖరీఫ్ 2025 డిజిటల్ సర్వే, ధర్తి ఆబా జంజయంతి గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాల గురించి అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూమని వెంకటయ్య , వి ఆర్ ఓ వెంకటయ్య, పీఎస్ జి నారాయణ రెడ్డి, పరిపూర్ణ, మరియు చింతల మర్రిపాలెం గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మస్తాన్ వలి స్వామి హుండీ లెక్కింపు



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 16 (శుభోదయం న్యూస్) : మస్తాన్ వలి స్వామి హుండీ లెక్కింపు మంగళవారం ఉదయం ప్రారంభించారు వర్క్ బోర్డు అధికారులు కమిటీ సభ్యులు మధ్య లెక్కింపు ప్రారంభమైంది కాగా టూ టౌన్ సిఐ ఏపీ మస్తాన్ తో పాటు పోలీసులు పాల్గొన్నారు.

## వృద్ధులను ఆదరించడం అభినందనీయం

### టిడిపి మండల అధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : మండలంలోని బుద్ధవరం శివారు రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కర్నాటి రామకృష్ణ సాగర్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు నాగార్జున నాగలక్ష్మి లు వంద మంది వృద్ధులకు దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తులసి మోహన్ మాట్లాడుతూ, కుమారుడు లేకపోయినప్పటికీ జ్ఞాపకార్థం ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు చేయడం మంచి విషయం అన్నారు. అతని పేరున సేవలు చేస్తే ఆత్మ శాంతిస్తుందని ఆకాంక్షిస్తూ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం ముదావహం అన్నారు. నాగార్జున కొడుకు పేరిట చేస్తున్న సేవలను ప్రశంసించారు. సర్పంచ్ బడుగు బాలమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు ముద్రబోయిన శ్రీనివాసరావు, విజయ డైయిరి డైరెక్టర్ పాలడుగు నాని, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కార్యదర్శి బొప్పిడి దొరబాబు, చోడవరపు ధర్మయ్య, కరిముల్లా, కిరణ్ కుమార్, తాడిపర్తి రజిని, మరియదాసు, కొండా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### మస్తాన్ వలి ఉరుసును ప్రజలందరూ

## శాంతియుతంగా జరుపుకోవాలి

### టూ టౌన్ సీఐ ఏపీ మస్తాన్



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూలై 16 (శుభోదయం న్యూస్): మస్తాన్వలి ఉర్సు ఈనెల 20 ,21, 22 తేదీల్లో జరుగుతున్న దృష్ట్యా ఉర్సు మహోత్సవాన్ని పట్టణ ప్రజలందరూ శాంతియుతంగా జరుపుకోవాలని టూ టౌన్ సీఐ ఏపీ మస్తాన్ పిలుపునిచ్చారు మంగళవారం మస్తాన్ వలి దర్గా ఉర్సు జరిగే స్థలాలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా సిఐ ఏపీ మస్తాన్ మాట్లాడుతూ మస్తాన్వలి స్వామి దర్గా ఉరుసుకు రాష్ట్రం నుంచే కాక కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తారని ఉరుసు మహోత్సవము దాదాపు నెలరోజుల పాటు జరుగుతుందని ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుంతకల్ డిఎస్పి సూచనల మేరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాము భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# చెంచు గిరిజన గూడెంలో సమస్యలు పరిష్కరించాలి





దోర్నాల, మండల రిపోర్టర్ - ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండలంచెంచు గిరిజన గుడాల్లో సమస్యలు పరిష్కరించాలి. కొమరం భీమ్ గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం పిఓపి వినతి పత్రం చెంచు గిరిజన గుడాలను సందర్శించి వారి సమస్యలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపబడలా చూస్తా పిఓ వెంకట శివ ప్రసాద్ కొమరం భీమ్ గిరిజన సంఘానికి హామీ. మంగళవారం శ్రీశైలం ఐ టి డి ఏ ప్రాజెక్టు ఆఫీస్ నందు శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్ కు కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘంరాష్ట్ర గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం చెంచుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చి మాట్లాడుతూ దోర్నాల మండల పరిధిలో చెంచు గిరిజన గూడా లకు తాగునీటి సమస్య,వ్యక్తిగత లోన్లు,ఉపాధి,చెరువు గూడానికి తారు రోడ్ల నిర్మాణం చేపట్టాలి. గిరిజన చెంచులు పొలాలకు రోడ్లు ఏర్పాటు చేయాలి. గిరిజన సంక్షేమ స్కూళ్లలో ఉపాధ్యాయులు. పోస్టులను భర్తీ చేయాలి. అన్ని చెంచు గిరిజన గుడాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయుట గురించి విన్నపం చెంచు గిరిజనులు అక్కడున్న సమస్యలను మాకు చెప్పారు. చెరువు గూడెంలో తాగే బోరు వాటర్ బురద కలిసి వస్తుందని తాగడానికి మంచి నీళ్లు లేక ఇబ్బందికరంగా ఉన్నాయని.పొలాలకు పోయేటప్పుడు దారి సరిగ్గా లేక పండించిన వాటిని తీసుకురావాలంటే ఇబ్బందికరంగా ఉందని మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని.వారికి సాగు చేసుకునేందుకు కాడి ఎద్దులు ట్రాక్టర్ బర్రెలు గొర్రెలు.ఇవ్వాలని గూడెంలో చుట్టూ కంప పెరిగిపోయింది అడవి వన్యమృగాలు చిరుతపులలో పెద్ద పులులు ఎలుగుబంట్లు వస్తున్నాయని. అదేవిధంగా వాళ్ళ స్కూలుకు ఉపాధ్యాయులు సరిగ్గా రావట్లేదు అంట పిల్లల చదువుకు ఇబ్బందికరంగా ఉన్నదని తెలియజేశారు అదేవిధంగా ఆ గూడెంలో చదువుకునే అమ్మాయి నాకు నర్సింగ్ సిటీ ఇప్పించాలని అమ్మాయి కోరింది. ఎర్రకురవలో చెంచులకు తాగటానికి నీళ్లు లేవని భారీగా వర్షాలు పడుతుంటే పూరి గుడిసెల్లో ఇబ్బందులు పడుతున్నామని మాకు తార్బాల్ పట్టాలు మంజూరు చేయాలని. మేము బ్రతకడానికి ఏవైనా బర్రెలు గొర్రెలు ఇస్తే నీవు బ్రతుకుతామని వారు తెలిపారు. నందిగూడెం. లో ఉంటున్న చెంచులు ఎప్పుడో పాత ఇల్లు ఉన్నాయని అవి పడిపోయే స్టేజ్ కి వచ్చాయని మాకు ఇల్లు కట్టి ఇవ్వాలని లేని వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల ఐ టి డి ఏ నుండి ప్రభుత్వమే మాకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని. కొంతమంది చెంచు గిరిజల్లు మేం పొలాలు సాగు చేసుకోవాలంటే బోర్లు ఎండిపోయాయని కొత్త బోర్లు నిర్మాణం చేపట్టాలని మాకు ఎరువులుపంపిణీ చేయాలని మేం పొలాలు ఎందుకు కాడెదులు ట్రాక్టర్స్ బర్రెలు గొర్రెలు లోన్లు మంజూరు చేయాలని. మాకు పొలాలు ఉన్నప్పటికీ అడవి హక్కుల చట్టం కింద మా పొలాలకు పట్టాలు ఇవ్వాలని. పొలం లేని వారికి పొలం ఇవ్వాలని వారు సమస్యలను మా సంఘం ద్వారా తీసుకువచ్చారు. కావున పై పొందుపరిచిన అంశాలని పెద్ద మనసుతో ఈ సమస్యలను పరిష్కరించాలని మీ ద్వారా ప్రకాశం జిల్లా కలెక్టర్ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరడమైనది. స్పందించిన పిఓ ఈ సమస్యలనుత్వరలో పరిష్కరించబడిన అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని అని చెప్పడం జరిగింది.ఆయన కలిసిన వారిలో%ఖజ×% వై శీను మల్లికార్జున. కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం.కే వెంకటేశం కె అంకన్న . షేక్షావలి. కే మల్లేశ్వరి. మల్లమ్మ. భ్రమరాంబ పార్వతి.తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు రహదారి ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమం




జంగారెడ్డిగూడెం- డివిజన్ ఇంచార్జ్ - జులై 15 (శుభోదయం న్యూస్): జంగారెడ్డి గూడెం డిఎస్పి యు రవిచంద్ర, జంగారెడ్డి గూడెం సి ఐ ఎం సుభాష్ ఈ రోజు జంగారెడ్డి గూడెం ఆటో డ్రైవర్లతో రహదారి ప్రమాదాల నివారణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డి గూడెం డీఎస్పీ ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ గతంలో చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లాలంటే ప్రయాణ సాధనాలు రిక్షాలు కాలి నడకన వెళ్లే వాళ్లని ఆధునిక కాలంలో ఆటో రిక్షాలు అందుబాటు లోకి వచ్చిన తర్వాత త్వరితగతిన ప్రజలు వారి యొక్క గమ్యస్థానాలకు చేరాలంటే ప్రతి ఒక్కరు కూడా ఆటో రిక్షాలను ఆశ్రయిస్తున్నారని, ఆటో డ్రైవర్లు ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదని



తెలియజేశారు. ఆటోలను రోడ్డుపై అడ్డంగా ఉండకుండా నిర్మిత ప్రదేశాలలోనే ఆటోలను నిలుపుకోవాలని, ఆటో డ్రైవర్లు ఆటోలు నడిపే సమయాలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ఉండాలని, ఆటోలను డ్రైవర్లు ప్రమాదహితంగా ఆటోలలో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాలలో నేషనల్ హైవే 216 ఉండుటవలన ఆటో డ్రైవర్లు అతి జాగ్రత్తగా ఆటోలు నడపాలని, ఆటో డ్రైవర్లు ఉండాలని అపసవ్య దిశగా ఆటోలు నడపరాదని తెలియజేశారు. ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ కలిగి ఉండటం వల్ల కలిగే ఉపయోగాలను గురించి ఆటో డ్రైవర్లకు డి.ఎస్.పి సూచనలు జారీ చేశారు. జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కుటుంబరావు మాట్లాడుతూ రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ప్రయాణికులను ఎక్కించుకునేటప్పుడు దించేటప్పుడు రోడ్డుకు పూర్తిగా పక్కకు వెళ్లి ఆపాలన్నారు. డీజే సౌండ్ లతో వెనక వచ్చే వారికి ఇబ్బంది కలిగిస్తే అటువంటి వారిపై యాక్షన్ ఉంటుందని అన్నారు. ప్రపంచానికి నువ్వు ఒక్కడివే కాకపోయినా నీ కుటుంబానికి నువ్వే పెద్దదిక్కని ప్రతి ఒక్కరు గ్రహించి రహదారి నియమ నిబంధనలు పాటిస్తూ ఆటోలను నడపాలని హితవు పలికారు, ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎస్సై జబ్బర్ అలీ, పోలీస్ సిబ్బంది మరియు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# పామూరు సింగల్ విండో ఛైర్మన్ ఉప్పలపాటి హరిబాబుకు శుభాకాంక్షలు




పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండలం సింగల్ విండో అధ్యక్షునిగా ఎన్నికైనటువంటి మా అన్న ఉప్పలపాటి హరిబాబు కు శుభాకాంక్షలు. ప్రజా సేవకుడు నిరంతరం ప్రజల్లో ఉండేటువంటి నాయకుడు తనదైన ముద్ర వేసుకుంటూ గత 30 సంవత్సరాలు నుండి తెలుగుదేశం పార్టీకి తమదైన శైలిలో సేవలు చేస్తున్నటువంటి మా అన్న ఉప్పలపాటి హరిబాబును గుర్తించి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆయనకు సింగల్ విండో చైర్మన్ మాకు చాలా ఆనందంగా ఉందని మెంట నరసింహారావు ఒక ప్రకటన తెలియజేశారు. తదుపరి మమ్మీ డాడీ సెంటర్లో బాణాసంచాలు పేలుస్తూ ఉప్పలపాటి పేరుతో నినాదాలు చేస్తూ పండగ వాతావరణాన్ని నెలకొల్పి స్వీట్లు పెంచారు. ఈ కార్యక్రమంలో బండ్ల నారాయణ, నర్సింగ్ సాంబయ్య, తోట రవికుమార్, కొండ నరసింహులు, మధు, గద్దె శేషు, ఐదు ఎంపీటీసీ నాయబ రసూల్, మాచర్ల రహిమాన్, చిన్న హాజరత్, పాలపర్తి రమణయ్య, పాయల తిరుపతయ్య, నొస్సం నాగేంద్రా చారి, పిట్టల ప్రసాద్, వెంగళ శెట్టి బాబురావు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

### జడ్పీ చైర్మన్ ఉప్పల హారిక దౌర్జన్యం చేసిన

# ముద్దాయిలును వెంటనే అరెస్ట్ చేయాలి

### యస్ పి కి డియస్పి ద్వారా వినతి పత్రం పంపిన గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజా బెత్ రాణి




గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : ఉమ్మడి కృష్ణ జిల్లా జెడ్పీ చైర్మన్ బి సి మహిళ ఉప్పల హారిక పై గత శనివారం గుడివాడలో జరిగిన దాడి సంఘటనలో దోషులను నేటికి అరెస్టుచేయలేదు,ప్రజాస్వామ్యంలో ఇలాంటి దుశ్చర్యలు తగవని వెంటనే ముద్దాయిలను అరెస్టు చేయాలని గన్నవరం నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులుగా మేము డియస్పిద్వారా జిల్లా ఎస్ పి ఈ రోజు అర్జిని పంపినట్లు గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి తెలిపారు. ప్రధానంగా జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ అంటే ఉమ్మడి జిల్లా ప్రదానా పౌరురాలు ఆమేకే రక్షణ లేకుండా శనివారం గుడివాడలో దాడి జరిగింది. ఇది హేమమైన చర్యగా మేము భావిస్తున్నాం.అని నేటికి నాలుగు రోజులైన ముద్దాయిలను ఎందుకు అరెస్టు చేయలేదు పోలీసు యస్ పి గారిని తెలపాలని కోరాం అన్నారు. ఈవిషయాన్నిఎస్పీగారికి వినతి పత్రం మీ ద్వారా పంపించాలని కోరాము. అని చెపుతూ పోలీసు వారు అధికార పార్టీల వత్తిడికి తలవగ్గి అరెస్టు చేయట్లేదని ప్రజలు భావిస్తున్నారుఅని తెలిపాం అన్నారు భారత రాజ్యాంగం ప్రకారం ఎవరు దాడి చేసిన ఎంతటి వారైనా అరెస్ట్ చేయాలని రాజ్యాంగం చెపుతుంది.అంత బహిరంగంగా నడి రోడ్డుపై పథకం ప్రకారం పోలీసులు సమక్షంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక పై గుడివాడ ప్రస్తుత యం ఎల్ ఏ రాముఅండతో రెడ్ బుక్ ఆదేశాలుతో పెట్రేగిన ఆయన అనుచరులు దౌర్జన్యంగా దాడి చేసారు అదే రోజే గుడివాడ పోలీసు స్టేషన్లో ఆమే రిపోర్టు చేసిన కూడా ముద్దాయిలను ఎందుకు అరెస్టు చేయటం లేదు.అంటే అధికార పార్టీకి భయపడి చట్టాన్ని దుర్వినియోగం చేసినట్లు కాదా అని అడుగుతున్నాం వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపాము అన్నారు. అలాగే ఆమె కేబినెట్ హోదా కలిగిన వ్యక్తికి ఎందుకు సంవత్సరం నుండి పోలీసు సేక్యూరిటీ తగ్గించారు.అని ఎస్పీ ని అడిగినట్లు తెలిపారు . అందువలన వెంటనే ఆమెకు సెక్యూరిటీ పెంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేసినట్లు మరియు .దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపాం అన్నారు. జిల్లా ప్రధాన పౌరురాలు మహిళా ప్రజా ప్రతినిదికి రక్షణ చేయలేక పోతే సామాన్య ప్రజలకు మహిళలకు ఏమి న్యాయం చేస్తారు అని తెలిపాం అన్నారు.

# భారతదేశం గర్వించదగ్గ గొప్ప ఇంజనీరు డాక్టర్ కె.ఎల్.రావు



న్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : ప్రముఖ ఇంజనీరు, విజయవాడ పార్లమెంట్ మాజీ సభ్యులు, మాజీ కేంద్ర నీటి పారుదల, విద్యుత్ శాఖామాత్యులు డా. కె.ఎల్.రావు 123వ జయంతి సందర్భంగా ఈరోజు ఉదయం విజయవాడ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ డా.కె.ఎల్.రావు భవన్ లో వున్న కె.ఎల్.రావు విగ్రహానికి జలవనరుల శాఖ కృష్ణా డెల్టా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. మోహన్ రావు, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ మాజీ ఛైర్మన్ డా.సి.వి.శ్రీరామ్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు ఇతర ఇంజనీర్లు కలిసి పూజా కార్యక్రమం నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఆర్.మోహనరావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు రూపకర్త డా. కె.ఎల్.రావు అని, ఆయన కాంక్రీట్ పై రూపొందించిన పుస్తకం నేటికీ ఎన్నో ప్రాజెక్టుల రూపకల్పనలో ఉపయోగ పడుతుందని ఆయన ఇచ్చిన స్ఫూర్తితో యువ ఇంజనీర్లు క్రమశిక్షణతో పనిచేసి కొత్త ప్రాజెక్టుల రూపకల్పనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ డా.కె.ఎల్.రావు నదుల అనుసంధానం ద్వారానే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని ఇచ్చిన స్ఫూర్తితో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే 2015లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టిసీమ ద్వారా కృష్ణా గోదావరి నదులను అనుసంధానం చేసి కృష్ణా డెల్టాలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 13 లక్షల ఎకరాలకు 2015 నుంచి 2019 వరకు వరికి, చేపల చెరువులకు, రొయ్యల చెరువులకు 268 టి.ఎం.సి.ల గోదావరి జలాలను అందించటం వల్ల రైతులకు 50వేల కోట్ల ఆదాయం రావటమే కాకుండా భారతదేశం జి.డి.పి.లో 2వ స్థానంలో నిలిచిందన్నారు. కె.ఎల్.రావు కృషి వల్లనే నాగార్జుసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ లోని తిరువూరు, నూజివీడు, గన్నవరం, మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో 2.36 లక్షల ఎకరాల ఆయకట్టు కొత్తగా సాగులోకి వచ్చిందని అన్నారు. ప్రస్తుతం ఎన్.డి.ఎ. ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దశ దిశ నిర్దేశంతో జలవనరుల శాఖ మంత్రివర్యులు డా. నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం త్వరగా పూర్తయి 3వ జోన్ కి గోదావరి జలాలు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ మాజీ ఛైర్మన్ ఎం.ఆర్. ఎస్. ప్రకాశరావు, ప్రముఖ ఇంజనీర్లు ఎల్.కృష్ణప్రసాద్, బి.క్యు.రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# బుక్కాపురం గ్రామ కమిటీ సభ్యులతో మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు పామూరు మండలం బుక్కాపురం పంచాయతీకి సంబందించి వైయస్ఆర్ సీపీ గ్రామ కమిటీ నియమించడమైనదని స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి తెలిపారు..మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి అధ్యక్షతన,గ్రామ సర్పంచ్ మోరబోయిన రాధాకృష్ణ సమక్షంలో గ్రామ కమిటీ అధ్యక్షులుగా పిన్నెబోయిన శ్రీరాములు,ప్రధాన కార్యదర్శిలుగా కాకు గంగయ్య,యడవల్లి శ్రీరాములు,కార్యదర్శిలుగా చెరుకుపల్లి ఆంజనేయులు,పందిటి గురవయ్యలను నియమించారు. ఈ కార్యక్రమంలో ముడియాల అనంతరెడ్డి, భైరబోయిన చెంగలరావు,బొట్టా కొండయ్య,గోసు శ్రీనివాసులు,చింతం సుధాకర్,కుర్రా నాగరాజు,పంగా తేజ,పిట్టల కళ్యాణ్,మోరబోయిన శ్రీహరి,కాకు త్రినాధ్,భైరబోయిన మురళి,పిన్నబోయిన నరసింహులు,మట్టే అంకబాబు,మోరబోయిన శ్రీనివాసులు,మోరబోయిన పృద్వి తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మారెడ్డి పాలెం మోడల్ స్కూల్లో వరల్డ్ యూత్ స్కిల్ డే




లింగసముద్రం, మండల్ రిపోర్టర్ - కె సురేష్ (శుభోదయం న్యూస్): వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా ఏపీ మోడల్ స్కూల్ తిమ్మారెడ్డి పాలెం నందు విద్యార్థులకు డ్రాయింగ్ క్విజ్ వంటిపలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి నైపుణ్యాలు కూడా కలిగి ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్ మొహమ్మద్ హాఫ్టర్, ఒకేషనల్ ట్రైనర్స్ ఎం.పాండురంగయ్య, టి.కిరణ్ కుమార్ మరియు ఇతర ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతన్నను పొలం పిలుస్తుంది కార్యక్రమం




నెల్లూరు, జిల్లా ప్రతినిధి - శ్రీనివాసులు (శుభోదయం న్యూస్): నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలోని వేములచేడు, అనంతమడుగు గ్రామంలో స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద రైతుల పొలాలకు క్షేత్ర సందర్శనతో పాటు రైతుల పొలాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమమన్ని మండల వ్యవసాయ అధికారి హైమావతి మరియు ఏ డి ఏ, శ్రీదేవి నిర్వహించారు. స్థానిక రైతులతో కలిసి పొలాలను పరిశీలించిన అనంతరం గ్రామంలోని ప్రజలతో స్థానిక వేములచేడు, అనంతమడుగు పంచాయతీలలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంల మాట్లాడుతూ రైతులు పంటలు వేసుకుని మొదలు పంట నూర్పులు చేసేంతవరకు ఎప్పటికప్పుడు స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోని రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల పై దఅష్టి సారించాలని తద్వారా వేసిన పంటలలో పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు .ఈ పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రతి గ్రామంలో పొలాలను సందర్శించి రైతులకు యజమాన్య పద్ధతుల గురించి వివరిస్తాము అని అన్నారు.అలాగే ప్రతి మహిళా రైతు పాడి పరిశ్రమ పై దఅష్టి సారించాలని సూచించారు.అనంతరం రైతులకు ప్రకఅతి వ్యవసాయమే లాభసాటిగా ఉంటుందని ఏవో హైమావతి తెలిపారు. వేములచేడు, అనంతమడుగు గ్రామం లో ఘన జీవామఅతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఘన జీవామఅతం తయారీ విధానంపై రైతులకు తెలిపారు. ఘన జీవామృతం పంటలకు అందించడంవల్ల మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది హారిక ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గన్నవరం నియోజకవర్గంలో పారదర్శకంగా

# ఓటర్ల జాబితా రూపొందించాలి



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ సూచనలతో ఈరోజు ఉదయం గన్నవరం తహాశీల్దారు కార్యాలయంలో గన్నవరం నియోజకవర్గ ఇ.ఆర్.ఓ. టి.శివరామప్రసాద్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి ఓటర్ల తాజా పరిస్థితి, పోలింగ్ బూత్ల వివరాలను తెలియ జేశారు. ఈ సందర్భంగా టి. శివరామప్రసాద్ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలో నేటికీ నాలుగు మండలాల్లో 2,80,109 మంది ఓటర్లుగా నమోదయ్యారని, విజయవాడ రూరల్ మండలంలో 89,370 మంది, గన్నవరం మండలంలో 74,700 మంది, బాపులపాడు మండలంలో 72,120 మంది, ఉంగుటూరు మండలంలో 43,919 మంది ఓటర్లుగా నమోదయ్యారని గత సాధారణ ఎన్నికల నాటికి నియోజకవర్గంలో 306 పోలింగ్ స్టేషన్లు వుండగా రాజకీయ పార్టీల ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు బాపులపాడు మండలం, కాకులపాడు గ్రామం నుంచి విడగొట్టి రంగయ్యప్పారావుపేట గ్రామానికి ప్రత్యేకంగా 240 నెంబరుతో కొత్తగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామని తెలియజేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి కొత్తగా 1200 ఓట్లు మించిన 20 పోలింగ్ స్టేషన్లు రెండుగా విభజించటానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని 12 పోలింగ్ స్టేషన్లను విశాలమైన భవనాల్లోకి మార్చటానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని నాలుగు పోలింగ్ స్టేషన్ల పేర్లు మార్చటానికి ప్రతిపాదించామని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో గన్నవరం నియోజకవర్గ టి.డి.పి. పోల్ మేనేజ్ మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ళ వెంకట గోపాకృష్ణారావు మాట్లాడుతూ బాపులపాడు మండలం, వీరవల్లి గ్రామంలో శివారు గ్రామమైన నారాయణపురం గ్రామంలోని 400 ఓటర్లకు ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, అట్లాగే విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో ప్రస్తుతం 886 ఓట్లతో వున్న పోలింగ్ బూత్ 51కి సంబంధించిన ఓటర్లు రైల్వే ట్రాక్ అవతలి వైపున ఎక్కువమంది ఉన్నందున అక్కడే ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు చిమటా రవివర్మ (జనసేన), తంగిరాల శ్రీనివాసరావు (టి.డి.పి.), సి.హెచ్. వెంకటేశ్వరరావు (సి.పి.ఐ.), మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి రవికుమార్ గన్నవరం మండల తహాశీల్దారు కె.వి.శివయ్య, ఎన్నికల డిప్యూటీ తహాశీల్దారు కె.లక్ష్మీనాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరులో జిల్లా కలెక్టర్ విస్తృత తనిఖీలు



(శుభోదయం న్యూస్) బిట్రగుంట: నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ మంగళవారం కావలిడివిజన్ లోని అల్లూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. అందులో భాగంగా తొలుత అల్లూరు-2 లోనినాగుల దేవిగుంట వద్ద జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంకింద చేస్తున్న కాలువ పూడికతీత పనుల నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగాఅక్కడపనిచేస్తున్న ఉపాదికూలీలతో ముచ్చటిస్తూ ఎన్నిపనిదినాలుపూర్తిచేశారు, ఎంతవేతనంపొందారు అదేవిధంగా ఉపాధి హామీపనులు కాకుండా వేరేపనులు ఏమైనా చేస్తున్నారాఅనేవివరాలుఅడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డులులేనివారుతక్షణమేఆధార్ కార్డులుపొంది ప్రభుత్వం అందిస్తున్నగృహవసతిని పొందాలనిసూచించారు. అనంతరం రామకృష్ణ డిగ్రీకాలేజీలో నైపుణ్యత శిక్షణఅభివృద్ధిద్వారా నిర్వహిస్తున్నకుట్టు శిక్షణకేంద్రాన్ని పరిశీలించి లబ్ధిదారులకుతగు



సూచనలుసలహాలు అందజేశారు. అనంతరం సుమారు12 ఎకరాల విస్తీర్ణంలోఏర్పాటుచేసినదివాకర్ రెడ్డిహౌసింగ్ లేఔట్ తనిఖీచేశారు. త్వరితగతినపనులుపూర్తిచేసి లబ్ధిదారులు నివసించేలాచర్యలు చేపట్టాలన్నారు. స్లాబ్ వరకు వచ్చిన ఇళ్ళనువెంటనేపూర్తి చేయాలన్నారు.స్థానికులు మాట్లాడుతూనీటివసతి లేనందునపూర్తయిన గృహాలలో లబ్ధిదారులు ఇంకాచేరలేదని కలెక్టర్ దృష్టికితీసుకునివచ్చారు. తక్షణమేదీనిపైస్పందించినజిల్లా కలెక్టర్ నీటివసతి కల్పించేలా సంబంధిత అధికారులకుఆదేశాలు జారీచేశారు.అనంతరంబీసీ సంక్షేమవసతిగృహాన్నిఆకస్మికంగా తనిఖీచేసి అక్కడఏర్పాట్లను పరిశీలించారు. మరుగుదొడ్లను మరియు విద్యార్థులకుఅందిస్తున్న కోడిగుడ్లనాణ్యతను పరిశీలించారు. పిదపవిద్యార్థిని విద్యార్థులతోకలిసిసహపంక్తి భోజనంచేశారు.స్థానికులు మరుగుదొడ్లద్వారావచ్చేవ్యర్థమైన నీరువల్లసమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కలెక్టర్ దృష్టికితీసుకునివచ్చారు.దీనిపై స్పందించినజిల్లాకలెక్టర్ తక్షణమే మురుగనీరుసమస్యను పరిష్కరించాలనిమండల అభివృద్ధిఅధికారిరజినీకాంత్ కు సూచించారు.అనంతరం పాత్రికేయులతోమాట్లాడుతూ డెల్టాప్రాంతంలో కాలువలపూడిక తీతపనులు ఉపాధిహామిపథకం ద్వారాచేపట్టడంజరిగిందని అన్నారు.రైతులువరిపంట మాత్రమేకాకుండా ప్రత్యామ్నాయపంటల వైపుదృష్టిసారించాలని,రైతు సాధికారసంస్థలతోపనులు చేయాలనిఆయనసూచించారు. కాలువలుఒడ్డున చెట్లనునాటించి పచ్చదనంపెంపొందించేవిధంగా చర్యలుచేపట్టాలన్నారు. నైపుణ్యతశిక్షణసంస్థద్వారాశిక్షణ పొందుతున్న మహిళలకు ఉపాధి కల్పించేవిధంగాబ్యాంకునుండి రుణాలుపొందుపు సంఘాలనుంచి మంజూరుచేసేవిధంగాచర్యలు చేపట్టడంజరుగుతుందని, అదేవిధంగామార్కెటింగ్ సౌకర్యం కూడాకల్పించేవిధంగాచర్యలు చేపట్టడంజరిగిందన్నారు.బీసీ సంక్షేమవసతి గృహంలోవసతులు బాగున్నాయని100%అడ్మిషన్లు పూర్తిచేసేలాచర్యలుచేపట్టడం జరిగిందన్నారు.ఇప్పటివరకు సంక్షేమవసతి గృహాలలో95% అడ్మిషన్లుజరిగాయన్నారు. జిల్లాలోఅన్నివసతిగృహాలలో పూర్తిస్థాయిలోఅడ్మిషన్లు చేపట్టడానికితగు చర్యలు తీసుకోవడంజరిగిందన్నారు. వెనుకబడినతరగతులవసతి గృహంలోఇస్తున్నభోజనం బాగుందిఅన్నారు. పై కార్యక్రమంలో రెవెన్యూడివిజనల్ అధికారివంశీకృష్ణ,అల్లూరు మండలరెవెన్యూఅధికారి లక్ష్మీనారాయణ,మండలాభివృద్ధి అధికారిరజినీకాంత్ ఉపాదిహామి అదనపుప్రాజెక్టుఅధికారిమృధులవివిధశాఖల అధికారులుతదితరులు పాల్గొన్నారు.



# రక్షణ లేని ట్రాన్స్ఫార్మర్లతో పొంచి ఉన్న ప్రమాదం



నెల్లూరు జిల్లా ప్రతినిధి - శ్రీనివాసులు (శుభోదయం న్యూస్): నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలోని పలు ప్రాంతాలలో మరియు మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో రక్షణ లేని ట్రాన్సఫార్మర్లతో , మెయిన్ రోడ్డు సమీపంలో, రహదారుల వెంట ఏర్పాటు చేసిన ట్రాన్సఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుం డటంతో ఆయా దారిలో వెళ్లే ప్రజలు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. రాపూర్ క్రాస్ రోడ్ గవర్నమెంట్ హాస్పిటల్ సర్కిల్ లో ట్రాన్స్ఫార్మర్లు ప్రమాదంతో పొంచి ఉండటం రోజు రోజుకు పెరుగుతున్న విద్యుత్ వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా విద్యుత్ లైనల విస్తరణ కూడా జరగుతోంది. అయితే తదనుగుణంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలత్తెకుండా అదనపు ట్రాన్సఫార్మర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా ట్రాన్సఫార్మర్ల ఏర్పాటు చేసే సమయంలో తీసుకోవాల్సిన కనీస నిబంధనలను కాంట్రాక్టర్లు మరిచిపోతున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం చూసి చూడనట్లుగా వ్యవరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రోడ్లు, ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్సఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్, కంచెను,ఏర్పాటు చేయాలి ముఖ్యంగా రోడ్ల వెంట ఉండే వాటికి ఎక్కవగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అక్కడక్కడా ట్రాన్సపార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటం, మరికొన్ని చోట్ల ఫ్యూజ్ బాక్సులు లేకపోవడంతో తీగలను చిన్నారులు పట్టుకునే అవకాశం కూడా ఉంది. అదేవిధంగా మూగ జీవాలు సైతం మేత కు వెళ్లి ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## “బాబు షూరిటీ మోసం గ్యారంటీ”

# కార్యక్రమంపై విస్తృతస్థాయి సమావేశం




(శుభోదయం న్యూస్) బిట్రగుంట: చంద్రబాబు అంటేనే మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అని,ఉన్నదిలేనట్లు, లేనిదిఉన్నట్లుమాయాజాలం చేయడంలోమహాదిట్టఅని కావలిమాజీఎమ్మెల్యేరామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డివ్యాఖ్యానించాడు. బోగోలులోనివైసిపిపార్టీ కార్యాలయంలోమంగళవారం మండలకన్వీనర్ మద్దిబోయిన వీరరఘుఆధ్వర్యంలో నిర్వహించినబాబుషూరిటీమోసం గ్యారెంటీ,కార్యక్రమంపై నిర్వహించినవిస్తృతస్థాయి సమావేశంలోఆయనమాట్లాడారు. గతప్రభుత్వంలోఅక్రమాలకు అగ్రగాములైనప్రజాప్రతినిధులు ప్రస్తుతఎంఎల్ఏపంచనచేరగానే హరిచంద్రులఅవతారం ధరించారాఅన్నారు. కావలికికాపు కాయడంఅంటేఇదేనా? అనిప్రశ్ని ంచారు.పైలాన్ విషయంలో హత్యానేరంకేసులునమోదుచేస్తే కొండబిట్రగుంటలో ప్రారంభోత్సవం చేసినభవనంశిలాఫలకాన్ని తొలగించితమపేరుతోశిలాఫలకం వేయించుకున్నవారిపై ఏంకేసులు పెట్టాలన్నారు.జగన్ రెడ్డిపాలనలో అందినసంక్షేమఅభివృద్ధి పథకాలనుదృష్టిలోఉంచుకొని సంవత్సరకాలంలో ప్రజలకుకొత్తగా ఏమివరగపెట్టారోతొలిఅడుగు కార్యక్రమాన్నినిర్వహిస్తున్న తెలుగుదేశంనాయకులను నిలదీయాల్సినఅవసరం ఉందన్నారు.అలాగేజగన్ రెడ్డి ఇచ్చినసంక్షేమపథకాలుప్రస్తుత ప్రభుత్వంఅమలులో అవలంబిస్తున్నవిధానాలు ప్రజలకుఅర్థమయ్యేలాగ్రామ గ్రామానవైసీపీశ్రేణులుప్రజలకుఅర్థమయ్యేలావివరించాల్సిన బాధ్యతప్రతికార్యకర్తపై ఉందన్నారు.పార్టీతిరిగి అధికారంలోనికివస్తేకష్టపడ్డ కార్యకర్తలకేఅగ్రతాంబూలంఅని, గోడమీదపిల్లలకువేటుతప్పదని హెచ్చరించాడు. పైకార్యక్రమంలో జడ్పిటిసిమద్దిబోయినకీర్తన, ఎంపీపీమేకలసుజాత,వివిధ గ్రామపంచాయతీలసర్పంచులు ఎంపీటీసీలు,పార్టీఅభిమానులు కార్యకర్తలుఅధికసంఖ్యలో పాల్గొన్నారు.



# దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు : యార్లగడ్డ



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఉంగుటూరు మండలం ఓండ్రంపాడు, లంకపల్లి, ముక్కపాడు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించిన యార్లగడ్డ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ప్రజల విజ్ఞప్తులు స్వీకరించి వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముక్కపాడు గ్రామములో రూ.12 లక్షల ఖర్చుతో చల్లగుళ్ల సత్యనారాయణ స్థలం నుండి గ్రామ సచివాలయం వరకు, మేకల సీతమ్మ ఇంటి నుండి మేకల వెంకటేశ్వరరావు ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్లను యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చామని ఈ పథకాన్ని ఇప్పటికే అమలు చేసినట్లు చెప్పారు. ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నట్లు వివరించారు. మహిళా అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డ్వాక్రా మహిళలకు 13 శాతం ఉన్న వడ్డీని 11 శాతాన్ని తగ్గించి రూ. 28 వేలకోట్లు లింకేజీ రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక అభివృద్ధిలో రాష్ట్రంలోనే గన్నవరం ప్రముఖ స్థానంలో నిలవబోతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ఎజెండాగా ముందుకు సాగుతున్నట్లు చెప్పిన ఎమ్మెల్యే వెంకట్రావ్ అభివృద్ధి పరంగా గన్నవరంను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెడతానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ ఏడాదిపాలనలో తాను ఒక్క పైసా అవినీతికి పాల్పడలేదని గత వైసీపీ ప్రభుత్వ పాలకుల మాదిరిగా మట్టి దందాలు చేయలేదని ఏ ఒక్కరిమీద అక్రమ కేసులు బనాయించలేదని పేర్కొన్నారు. టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో తలేత్తుకుని ప్రతి ఇంటికీ వెళ్లి సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముందుకు తీసుకు వెళ్లాలని పిలుపినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల టీడీపీ పార్టీ ప్రెసిడెంట్ కొలుసు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్, మల్లెల శివరంగారావు, జల్లెడ చిన్న పుల్లయ్య, అరికట్ల రవి, మాయరా రమేష్, జల్లెడ శ్రీమనరాయణ, రామిరెడ్డి బాల కృష్ణ, కర్రే ప్రేమ కుమార్, కొండ రాంబాబు, నక్క వేరా వెంకటేశులు, టీడీపీ సీనియర్ నాయకులు కొండేటి వెంకటేశ్వరావు, అరుమళ్ళ కృష్ణ రెడ్డి, చల్లగుళ్ల షణ్ముఖ్, డీ సీ అధ్యక్షులు తుమ్మల జగదీష్, కొలవెన్ను నాగబాబు, రాజమన్నర్, దాసరి నాగేంద్ర, తెలుగు యూవత నాయకులు పరుచూరి నరేష్, కొసరాజు సాయిరాం, వంగ అయ్యప్ప రెడ్డి, బజవాడ నాగేశ్వరావు, కొమ్మినేని బాబీ, తదితరులు పాల్గొన్నారు.....



## సిబిఐటిలో 1990ల బ్యాచ్‌లకు ప్రత్యేక ఆలుమ్ని మీట్ - గ్రీట్ - జూలై 19, 2025న నిర్వహణకి అన్ని ఏర్పాట్లు పూర్తి




హైదరాబాద్, (శుభోదయం న్యూస్): హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 1990 నుంచి 1999 మధ్య కాలంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా "ఆలుమ్ని మీట్ - గ్రీట్" కార్యక్రమాన్ని ప్రకటించడంలో గర్వంగా ఉంది. "బ్యాక్ తో వేర్ ఇట్ అల్ బెగన్ " అనే థీమ్‌తో జూలై 19, 2025 (శనివారం) ఉదయం 9:30 గంటలకు సిబిఐటి క్యాంపస్‌లో ఈ సంస్మరణీయ సమావేశం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి వి నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ద్వారా 1990ల కాలంలో సిబిఐటిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మళ్లీ కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని , సహపాఠులు, అధ్యాపకులతోపాటు తమ కాలేజీతో మళ్లీ అనుబంధాన్ని పునరుద్ధరించుకోవచ్చు. పాల్గొనేవారు తమ వృత్తి జీవితం, అభివృద్ధిపై అనుభవాలను పంచుకుంటూ, ఆనందాన్ని పంచుకుంటారు. అర్హత కలిగిన పూర్వ విద్యార్థులందరికీ ఆహ్వానం అందజేస్తూ, ఇన్విటేషన్‌లో ఉన్న క్యూ ఆర్ కోడ్ ద్వారా అనే ఈమెయిల్‌కు సంప్రదించి నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

## బరంగేడిగి పాఠశాల లో ఘనంగా బోనాల ఉత్సవాలు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగేడిగి గ్రామం లోని ప్రాథమిక పాఠశాల లో ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు విద్యార్థులు పోతరాజు వేషాలతో అలరించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## ఎంపీడీవో ని సన్మానించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈతాప రాములు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మరియు శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కమిటీ డైరెక్టర్ ఈతాప రాములు నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన జలంధర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఈతాప రాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు,చేరువయ్యేలా చూడాలని ఎంపీడీవో ని కోరడం జరిగింది. పెద మధ్యతరగతి కుటుంబాల వారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

## కంటోన్మెంట్ ను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం: ఎంపీ ఈటెల రాజేందర్



తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్), జూలై 15: కంటోన్మెంటును సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ బోర్డ్ కార్యాలయంలో బ్రిగేడియర్ రాజీవ్ అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మురికి కూపమగా తయారైన రామన్నకుంట చెరువును ఆహ్లాదకరంగా.. సేదతీరే విధంగా తయారు చేయబోతున్నట్లు వెల్లడించారు. అదే విధంగా పార్కులు,ఓపెన్ జిమ్ములు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తో మంచి ప్రణాళికతో సుందరమైన కంటోన్మెంట్ గా తయారు చేయబోతున్నట్లు వెల్లడించారు.రాజీవ్ రహదారి, నాగపూర్ హైవే ఫ్లై ఓవర్ కింద పోయిన భూములకు రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు జమ చేసిందన్నారు.303 కోట్లతో కంటోన్మెంట్ లో ఎక్కడా కూడా నీరు నిలువకుండ సివరేజు నాళాలతో బయటకు పంపే విధంగా డ్రైనేజీ వ్యవస్థ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీతారాంపురం కాలనీలో ఇప్పుడు వరదలు వచ్చినా మొట్టమొదటగా ముంపుకు గురయ్యే ప్రాంతం. దీనికి కూడా శాశ్వత పరిష్కారం చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బోర్డు సీఈవో మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## జి ఎం పి ఎస్ వరంగల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం




తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్): గొర్రెల,మేకల సహకార సంఘంలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి జిల్లా గౌరవ అధ్యక్షులు చల్ల మల్లయ్య గొల్ల కురుమలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి జిఎం పి ఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ విద్యతో సమాజంలో గౌరవం అలాగే డాక్టర్ కావటి విజయ్ గొర్రెలు, మేకల సహకార సంఘం (సొసైటీ) ఎన్నికలు వెంటనే నిర్వహించాలని జి.ఎం.పి.ఎస్ వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు చల్ల మల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం రోజున నర్సంపేట పట్టణ కేంద్రంలోని గెస్ట్ హౌస్ లో జరిగిన మండల ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కావటి విజయ్, జిల్లా గౌరవ అధ్యక్షులు చల్ల మల్లయ్య, జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు గొల్లకురుమలకు రెండు లక్షల రూపాయలతో గొర్రెల కొనుగోలుకు నగదు బదిలీ చేస్తామని హామీని ఇచ్చారని, సొసైటీ సభ్యులు ప్రమాదవశాత్తు చనిపోతే ఆరు లక్షల రూపాయల నష్టపరిహారం ఇస్తామని హామీలు ఇచ్చి 20 నెలలు గడుస్తున్నప్పటికీ, ప్రభుత్వంలో ఏ ఎలాంటి స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షులు చల్ల మల్లయ్య, జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, జిల్లా సహా కార్యదర్శి కుండే లింగస్వామి నర్సంపేట నూతన మండల కమిటీ 21 మందితో ఎన్నుకోవడం జరిగింది.

## ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో మొక్కలు నాటిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ



గోదావరిఖని టౌన్, రిపోర్టర్–సురేష్,(శుభోదయం న్యూస్): టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకున్న అన్ని పనులు వెంటనే గ్రౌండింగ్ చేయాలని రామగుండం శాసన సభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ప్రదాన రహదారి డివైడర్ లో మొక్కలు నాటిన అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె . అరుణ శ్రీ తో సమావేశం అయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థ ఎన్నికలు రానున్న దృష్ట్యా కోడ్ కంటే ముందే శంఖుస్థాపన చేసుకున్న అన్ని పనులు పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని అన్నారు . ఏక కాలంలో వివిధ చోట్ల జరుగుతున్న అభివృద్ధి పనులు పర్యవేక్షించేందుకు ఇంజనీరింగ్ అధికారులు వేర్వేరు బృందాలుగా వెళ్లాలని అన్నారు. డివిజన్ లోని చిన్న చిన్న వీధులలో రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని అన్నారు.కొత్తగా రామగుండం నగర పాలక సంస్థలో విలీనమైన లింగాపూర్ వైపు పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నందున అన్ని రకాల మౌళిక



వసతుల కల్పించడానికి సన్నాహాలు చేయాలని అన్నారు. రాజీవ్ రహదారితో పాటు నగరంలో అన్ని వీధి దీపాలు వెలిగేందుకు నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు.ఆర్ %డ%బి తో పాటు ఇతర విభాగాలు చేపడుతున్న పనులను కూడా త్వరితగతిన నాణ్యతతో పూర్తయ్యేలా నగర పాలక సంస్థ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. వన మహోత్సవం లో నాటిన అన్ని మొక్కలు సజావుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్ పాల్గొన్నారు.

## అమీన్పూర్‌లో ముదిరాజ్ భవనం నిర్మాణం శుభారంభం




అమీన్పూర్, (శుభోదయం న్యూస్): అమీన్పూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న అతి పెద్ద ముదిరాజ్ భవనం పనులను వేగవంతం చేయాలని బీజేపీ అమీన్పూర్ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయనతో అమీన్పూర్ ముదిరాజ్ సంఘం నాయకులు సమావేశమయ్యారు. ముదిరాజ్ పెద్దలతో మాట్లాడిన ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ,అమీన్పూర్ ప్రాంతంలో ముదిరాజ్ బంధువులను ఒకటిగా మేళవించి, ప్రతి గ్రామంలో ముదిరాజ్ భవనాల నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. అమీన్పూర్‌లో ప్రారంభమైన ముదిరాజ్ భవనం నిర్మాణానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మన్నే రాములు ముదిరాజ్, ఉపాధ్యక్షులు కొల్లూరు యాదగిరి ముద్రాజ్ ,ప్రధాన కార్యదర్శి మన్నే రవీందర్ ముదిరాజ్,నాయకులు రాట్నాల దశరథ్ ముదిరాజ్, కొల్లూరి గోపాల్ ముదిరాజ్, సుంకరి కుమార్ ముదిరాజ్, రత్నాల యాదయ్య ముదిరాజ్, గజ్జల కృష్ణ ముదిరాజ్, గాజ బోయిన నరసింహ ముదిరాజ్, సుంకరి జీతయ్య ముదిరాజ్, గజ్జల శ్రీశైలం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవం పలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న.... బీఆర్ఎస్ నాయకులు మాదిరి ప్రిథ్వీరాజ్



జిన్నారం, (శుభోదయం న్యూస్): పటాన్‌చెరు నియోజకవర్గం జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామం మరియు పటాన్చెరు మండలం పాటి గ్రామంలో ఏర్పాటు చేసిన పలారం బండి ఉత్సవాలలో పాల్గొని శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లిని దర్శించుకున్న మాదిరి పృథ్వీరాజ్ దర్శించుకున్నారు. గ్రామస్తులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ, తెలంగాణలో బోనాలు భక్తి, శ్రద్ధ, సమైక్యతకు ప్రతీకగా నిలుస్తాయి. ప్రజలు తమ గ్రామ దేవతల పట్ల ఉన్న విశ్వాసాన్ని ఈ పండుగలో వ్యక్తపరుస్తారు. ఇది మన సంప్రదాయాలకు గుర్తింపు కలిగించే పండుగ. ఇలాంటి వేడుకలు మన సంస్కృతి విలువలను, గ్రామీణ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి, అని అన్నారు.



## టిప్పర్ ను ఢీకొని వ్యక్తి మృతి




జిన్నారం, (శుభోదయం న్యూస్): రోడ్డు పక్కన నిలిపి ఉంచిన టిప్పర్ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో జిన్నారం మండలం దాది గూడెం గ్రామ శివారులో ప్రధాన రహదారిపై బ్రేక్ డౌన్ అయిన టిప్పర్ ను రోడ్డు పక్కన నిలిపి ఉంచగా, అటుగా బైకుపై వస్తున్న సుదర్శన్ (40) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు టిప్పరును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సుదర్శన్ గుమ్మడిదల మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన సుదర్శన్ ఇతనికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. స్థానికుల సమాచారంతో జిన్నారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమాష్టం కోసం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## రామగుండం నియోజకవర్గం అభివృద్ధి మరింత వేగంగా చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి అరుణ శ్రీ తో చర్చించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



రామగుండం మండలం, రిపోర్టర్– తిరుపతి, (శుభోదయం న్యూస్): రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి మరింత వేగం అందించేందుకు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి అరుణ శ్రీ తో కలిసి అనేక కీలక విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రతి డివిజన్ స్థాయిలో చేపట్టవలసిన రోడ్ల మరమ్మతులు, వీధి లైట్స్ బిగింపు, డ్రైనేజ్ వ్యవస్థ పునరుద్ధరణ, పారిశుధ్యం, పచ్చదనం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై తగిన ఆదేశాలు జారీ చేయడమైంది.ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులకు ఆదేశాలు ఎమ్మెల్యే స్పష్టంగా పేర్కొన్నారు.ప్రజలకు నిత్యావసర సదుపాయాలు, మౌలిక వసతుల కల్పన ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఉందనిఈ దిశగా రామగుండం మున్సిపల్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రహదారుల విస్తరణ మరియు మరమ్మతులు: పలు కాలనీల్లో రహదారులు చాలా దుర్వస్థితిలో ఉన్నందున, కాంక్రీట్ రోడ్లు, బిటుమిన్ రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని సూచించారు. వీధి లైట్లు మరియు ఎలక్ట్రికల్ మౌలిక వసతులు: అన్ని డివిజన్లలో సౌరశక్తితో నడిచే వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, పాత లైట్లను తిరిగి బదిలీ చేయాలని ప్రతిపాదించారు.డ్రైనేజ్ వ్యవస్థ పునరుద్ధరణ: వరదలు, వర్షపు నీటి నిల్వ నివారణకు అనుకూలంగా ఉండేలా మౌలికమైన డ్రైనేజీ పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. పచ్చదనం మరియు పారిశుధ్యం: ప్రతి డివిజన్లో పార్కులు, చెట్ల పెంపకం, వ్యర్థాల పారదర్శక నిర్వహణపై దృష్టి పెట్టాలని తెలిపారు.అధికారులపై సమీక్ష. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కూడా మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. ప్రతిపాదించిన పనులపై టెండర్లు వేగంగా పిలవాలని, పనులు నాణ్యతతో పూర్తి అయ్యేలా పర్యవేక్షణ కూడా పెంచాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యం, విజన్ 2026 రామగుండం అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరమని, 2026 నాటికి రామగుండాన్ని అభివృద్ధి పరంగా మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వ లక్ష్యాలు ఉన్నాయని ఎమ్మెల్యే గారు చెప్పారు. ప్రజల నుంచి వచ్చే సూచనలకు, ఫిర్యాదులకు స్పందిస్తూ సమగ్ర ప్రణాళిక అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.రామగుండం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధి పనులు ప్రజల సహకారంతో వేగంగా, పారదర్శకంగా పూర్తవుతాయన్న నమ్మకంతో ఎమ్మెల్యే ప్రెస్ మీట్ ముగించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

## 17 డివిజన్ గాడేపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం








తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్ ): గ్రామ,వార్డు స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఆదివారము కాంగ్రెస్ పార్టీ గ్రామ/వార్డు కమిటీ అధ్యక్షులు అధ్యక్షతన గ్రామ/వార్డు కమిటీ సమావేశాలు నిర్వహించాలని మన ప్రియతమ నాయకులు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశించడం అయినది 17వ డివిజన్ అధ్యక్షుడు పసునూరి వేణుగోపాల్ సాల్మన్ ఆధ్వర్యంలో గాడేపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు కడిదల రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మన ఇందిరమ్మ ప్రభుత్వం ఎలక్షన్లో ఇచ్చిన హామీ ప్రకారం ఫ్రీ బస్సు గ 200 యూనిట్ల కరెంటు. 500 గ్యాస్. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అలా చెప్పుకుంటూ పోతేతి మన ప్రజా ప్రభుత్వం పేదవారికి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తా ఉన్నది. జూలై 4వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సామాజిక న్యాయ సమరభేరి సభలో %ూ×జజ% అధ్యక్షులు మల్లికార్జునఖర్గే చేసిన దిశా నిర్దేశంపై చర్చ గ్రామ/ వార్డు స్థాయిలో కాంగ్రెస్ పార్టీని నిర్మాణాత్మకంగా క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై చర్చ. గ్రామ/ వార్డులలో వివిధ రాజకీయ పార్టీల పనితీరుపై విశ్లేషణ రాబోయే స్థానిక స్వంస్థల ఎన్నికలలో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం పై చర్చించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమాన్ని దృష్టి పెట్టుకొన కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించడం జరిగింది సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రామగుండం ఫర్టిలైజర్ సంస్థపై కేంద్రం ఎరువుల శాఖ కార్యదర్శి రాజత్ మిశ్రాని న్యూఢిల్లీలో కలిసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

### తెలంగాణకు 2.7 లక్షల టన్నుల ఎరువుల హామీ




రామగుండం మండలం, రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్): తెలంగాణకు సరైన ఎరువుల సరఫరా లోపిస్తున్న అంశంపై, నేడు కేంద్ర ఎరువుల శాఖ కార్యదర్శి రాజత్ మిశ్రా ని న్యూఢిల్లీలో కలిసిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కీలకంగా చర్చించారు. రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్ అనుకున్న ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోలేకపోవడం వల్ల, రాష్ట్ర రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని వివరించారు. యూరియా, డీఏపీ వంటి ముఖ్య ఎరువుల కొరత వల్ల సీజనల్ పంటల ఉత్పత్తిపై తీవ్రమైన ప్రభావం పడుతోందని గుర్తుచేశారు.ఈ సందర్భంగా ఎంపీ రాష్ట్రానికి ప్రత్యేక కోటా కేటాయింపు లాజిస్టిక్స్ సమస్యలు తక్షణ పరిష్కారం రామగుండం ప్లాంటు సామర్థ్యాన్ని పెంపుదల ప్రైవేట్ ఎరువు విక్రయదారుల నియంత్రణ తదితర అంశాలను అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. కార్యదర్శి రాజత్ మిశ్రా ఈ సమస్యలను సానుకూలంగా తీసుకొని స్పందించారు.గత ఖరీఫ్, రబీ సీజన్లలో జరిగిన లోటును ఈ సీజన్‌లో పూర్తిగా భర్తీ చేస్తామని తెలంగాణకు మొత్తం 2.7 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేస్తామన్న హామీ ఇచ్చారు. రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తా –ఎంపీ వంశీకృష్ణ ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రామగుండం వంటి జాతీయ స్థాయి ఎరువుల ప్లాంట్ తెలంగాణలో ఉన్నా, అక్కడి రైతులకు సరైన ఎరువులు దక్కకపోవడం అన్యాయమని కేంద్రానికి తెలియజేశాను. ఈ వ్యవహారంలో పాలసీ స్థాయిలో మార్పులు అవసరం. నా పోరాటం ఒక్క పార్టీ కోసం కాదు, రైతు కోసం. ఎరువుల కొరత వల్ల ఒక్కరైనా రైతు నష్టపోవద్దని నేను నిరంతరం కృషి చేస్తున్నాను. ప్రతి బస్తా ఎరువుకూ మా పోరాటం కొనసాగుతుంది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ, కేంద్రం నుంచి సహకారం అందుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీ గారు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే పార్లమెంటు ఆందోళనలకు సైతం వెనుకాడమని హెచ్చరించారు.

శుభోదయం
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM
WWW. SUBHODAYAMDAILY.COM
బుధవారం - 16 - జూలై - 2025

### విద్యార్థులకు చదువుతోపాటు

# క్రమశిక్షణ కూడా అవసరం

శ్రీ సరస్వతి విద్యా మందిర్ కరస్పాండెంట్ పి జి నరేష్



తనకల్లు రిపోర్టర్ – రవీంద్ర (శుభోదయం న్యూస్) : విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ చాలా అవసరమని శ్రీ సరస్వతి విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ పీజీ నరేష్ తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని వారు మంచి క్రమశిక్షణతో మెలిగితే తమ పౌరులుగా రేపటి నవ సమాజాన్ని స్థాపిస్తారని ఆయన అన్నారు. పిల్లల క్రమశిక్షణ విషయంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం చాలా అవసరమని వారు చొరవ తీసుకుని వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులకు సహాయం అందించాలని ఆయన కోరారు. మా పాఠశాలలో చదువుతోపాటు క్రీడలు ,కరాటే, డాన్స్ మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, అనిల్ కుమార్ నాయక్, రామచంద్ర ,అశ్విని, సుఫియా, పద్మజ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు హసనపురం చంటి పుట్టినరోజు వేడుకలు



తనకల్లు, రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్): భారతీయ జనతా పార్టీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు హసనాపురం చంటి జన్మదిన వేడుకలు మంగళవారం జానకిరామ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జానకి రామ్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే భారతీయ జనతా పార్టీలో కీలక వ్యక్తిగా పేరు పొంది, జిల్లా మోర్చా అధ్యక్షుడిగా ఎంపికయి ప్రజలకు ఎన్నో సేవలు చేసి మంచి మనిషిగా మంచి పేరు తెచ్చుకున్న హసనాపురం చంటి సంతోషాలతో అష్టైశ్వర్యాలు రాజకీయంగా మరింత ఉన్నత పదవులు పొందుతూ కలకాలం ఇలాంటి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆ దేవదేవుడు కలియుగ వెంకటేశ్వర స్వామిని మనసారా ప్రార్థిస్తూ మరొక మారు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అసనాపురం చంటి కి మండలంలోని పలువురు నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హసనాపురం చంటి కృతజ్ఞతలు తెలిపారు.

# ఈతోడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో రామా నాయక్



తనకల్లు రిపోర్టర్ రవీంద్ర (శుభోదయం న్యూస్) : తనకల్లు మండలం ఈతోడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం తనకల్లు ఎంపీడీవో రామా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిని తనిఖీ చేసి, సమయపాలన పాటించాలని ఆయన అన్నారు. ప్రజల నుండి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే బాధ్యత ఉద్యోగస్తుందేనని, మీ వంతు బాధ్యతను బాధ్యతగా నిర్వహించాలని ఆయన కోరారు ఆయన వెంట ఈఓ ఆర్ డి ఈతోడు సచివాలయ సెక్రెటరీ ఉన్నారు.

## లాల్ బజార్ శ్రీ మహంకాళి దేవాలయానికి ఘటం ఎదుర్కోలుతో నిమ్మకాయల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు




తెలంగాణా స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్ (శుభోదయం న్యూస్), జూలై 15: లాల్బజార్ శ్రీ మహంకాళి దేవాలయం లో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం అంబటి గంగయ్య వారసులు, లాల్ బజార్ మహంకాళి దేవాలయం ఘటం హక్కు దారుల కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘటం ఎదుర్కోలు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మకాయల శ్రీనివాస్ కుటుంబ సభ్యుల తిరుమలగిరి దేవాలయం నుండి ఘటం ఎదుర్కోలు ప్రారంభమై లాల్ బజార్ మహంకాళి అమ్మవారి ఆలయానికి అంగరంగ వైభవంగా నృత్య సాంప్రదాయాలతో భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించేందుకు అమ్మవారు దయతోనే సాధ్యమవుతుందని నిమ్మకాయల శ్రీనివాస్ పేర్కొన్నారు.

# సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎరిక్షన్ బాబు




దోర్నాల, మండల రిపోర్టర్ – ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండల కేంద్రంలోని ఏబీఎమ్ పాలెం పరిధిలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఇన్–చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు...! కార్యక్రమంలో టీడీపీ మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బిసిలకు 42% బిల్లును తక్షణమే

# పార్లమెంట్ చట్టం చేయాలి...

విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో అన్నింటిలో 42% అమలు చేయాలి.

ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్.



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్),జులై 15: బిసిలకు 42% బిల్లును పార్లమెంట్ లో తక్షణమే చట్టం చేయాలని, ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఇంద్ర పార్క్ ధర్నాచౌక్ వద్ద, బీసీ మేధావుల వేదిక ఆధ్వర్యంలో మహాధర్న నిర్వహించారు. బీసీలకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో వందలాదిమంది బీసీ నాయకులు ధర్నాకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ... బీసీలకు 42% ఆర్డినెన్స్ ద్వారా కాలయాపన జరుగుతుందని, తక్షణమే పార్లమెంట్లో చట్టం చేసి విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో 42% రిజర్వేషన్ అమలయ్యే విధంగా చేయాలని కేంద్ర, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంటు లో చట్టం అయ్యే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రపై ఒత్తిడి తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ మేకల హరినాథ్, బోయిన్ పల్లి రిటైల్ మార్కెట్ చైర్మన్ మక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి, బీసీ సెల్ అధ్యక్షుడు మట్టి శ్రీనివాస్, పిట్ల రాజు ముదిరాజ్, రాజు గౌడ్, పోచయ్య, కోమటి బాలరాజ్, శ్రీశైలం, చారి, కుమ్మరి బాలరాజ్, నాగేష్ ముదిరాజు, ప్రవీణ్, మోహన్ ముదిరాజ్, బిసి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బోనాల పండుగ చెక్కుల పంపిణీ రసభస...

మైనంపల్లి వర్గెస్ మర్రి వర్గీల మధ్య ఘర్షణ.



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్), జులై 15: కాంగ్రెస్ పార్టీ నాయకుల దౌర్జన్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, మల్కాజ్ గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మంగళవారం బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. అల్వాల్ లో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. చెక్కులు పంపిణీ చేస్తున్న క్రమంలో బిఆర్ఎస్ కార్పొరేటర్ ను స్టేజ్ పైన రానివ్వకపోడంతో ఒకసారిగా వివాదం చెలరేగింది. మైనంపల్లి హనుమంతరావు, మర్రి రాజశేఖర్ రెడ్డి వర్గీయుల మధ్య తలెత్తిన ఘర్షణ, అల్వాల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసే వరకు వెళ్లింది. మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ పాటించకపోవడం తమని అవమానించినట్లేదని అన్నారు. ఇరు వర్గాలకు చెందిన నాయకులు ఒక్కసారిగా దాడులకు దిగడంతో పాటు పోటా పోటీ నినాదాలు చేసారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో చెక్కుల పంపిణీ కోసం వచ్చిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అక్కడి నుండి వెను తిరిగారు. ఈ ఘర్షణలో కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి.



# పిల్లలకు స్పీచ్ తెరపి పరికరాలు పంపిణీ..

శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం: ముకుల్.



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్ ), జులై 15: నియోజకవర్గంలోని ప్రతివారికి సేవ చేయడమే తమ కర్తవ్యం అని, శ్రీ గణేష్ ఫౌండేషన్ నిర్వాహకుడు ముకుల్ తెలిపారు. నియోజకవర్గంలోని మంగళవారం 5వ వార్డు వాసవి నగర్ లో శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పామెన్ కాప్ మెంటల్లీ ఛాలెంజ్డ్ ( మంద బుద్ధి) పిల్లలకు స్పీచ్ థెరపీ కి సంబంధించిన మెటీరియల్ ను శ్రీగణేష్ ఫౌండేషన్ నిర్వాహకులు ముకుల్ అందజేశారు. పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ ఫౌండేషన్ నిర్వాహకులు ముకుల్ మాట్లాడుతూ.. శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ఇలాంటి పిల్లలను చూసినప్పుడు వారికి తాము ఏమైనా సహాయం చేయలనేమో ఆలోచించి ఫౌండేషన్ ద్వారా వారికి స్పీచ్ థెరపీకి సంబంధించిన మెటీరియల్ ను అందజేశామని భవిష్యత్తులో వారికి ఎటువంటి అవసరం వచ్చినా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు శరత్, ఎస్.జి.ఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



### కృష్ణా జిల్లా పరిషత్ చైర్ పర్సన్

## ఉప్పాల హారిక గౌడ్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నము

జై గౌడ్ ఉద్యమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్



(శుభోదయం న్యూస్) బాపట్ల : కృష్ణాజిల్లా ప్రథమ పౌరురాలు శ్రీమతి ఉప్పాల హారిక గౌడ్ జిల్లాలో పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వెళ్లడం నేరమా? ప్రజల సమస్యలను తెలుసుకొని తగిన పరిష్కారాలు అందిస్తున్న యువ నాయకురాలిపై దాడి చేయడం తగునా,ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు స్వేచ్ఛగా తిరగలేని దుస్థితికి దిగజార్చిన టిడిపి కూటమి నేతలు.ప్రతిపక్షానికి చెందిన పార్టీ నేతలు స్వేచ్ఛగా ప్రజల మధ్యకు వెళ్లి రాజ్యాంగబద్ధంగా పోరాటం చేయడాన్ని అడ్డుకోవడం అంటే రాష్ట్రంలో ప్రభుత్వ పాలన విఫలమైందని భావించాల్సి ఉంటుందని, ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తుందని స్పష్టమైతుందన్నారు.రాష్ట్రంలోని బీసీ కులాలలో అత్యధిక జనాభా కలిగిన గౌడ కులస్తులపై, గౌడ మహిళపై జరిగిన దాడిని పార్టీలకతీతంగా ప్రతి గౌడ సోదరుడు ఖండించాల్సిందే.బహుజన కులాల ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించలేని ప్రభుత్వానికి పరిపాలించే హక్కు లేదని రాష్ట్ర అధ్యక్షులు కిషోర్ గౌడ్ ప్రభుత్వాన్ని విమర్శించారు.ఒక మహిళా చైర్మన్ కి రక్షణ కల్పించలేని ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఏం భద్రత కల్పిస్తారని ప్రశ్నించారు.గౌడ కులస్తుల పైన దాడులు చేస్తే ఏ పార్టీ నాయకులైనా క్షమించేది లేదని హెచ్చరించారు. జిల్లా పరిషత్ చైర్మన్ పైన దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా గౌడులు, బడుగు బలహీన వర్గాలతో కలిసి జైగౌడ్ ఉద్యమం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేయాలని చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్ పిలుపునిచ్చారు.

### వర్షాలు లేక ఎండిపోతున్న పంటలను

# పరిశీలించిన సిపిఎం నాయకులు



గుంతకల్లు ప్రతినిధి,– పల్లె రామాంజనేయులు జూలై 16 (శుభోదయం న్యూస్) : సిపిఎం బృందం మంగళవారం గుంతకల్ మండలంలోని సంఘాల దోస్తులకి గుండాల తండా మొలకలపెంట గ్రామాల్లోని పలు వ్యవసాయ భూములను పరిశీలించారు వర్షం పడక పంటలు ఎండిపోయిన పొలాలను వారు పరిశీలించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# పీర్ల పండగలో ఘర్షణ ఒకరికి తీవ్ర గాయాలు

తనకల్లు, రిపోర్టర్ రవీంద్ర – (శుభోదయం న్యూస్):తనకల్లు మండలం సున్నంపల్లివారి పల్లికి చెందిన పూజారి భాస్కర్ అనే వ్యక్తిపై తలపై కట్టెతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించడం జరిగింది. 2025 జూలై 11వ తేదీ రాత్రి సుమారు 11:40 గంటల సమయంలో సదుం గ్రామంలో పీర్ల పండుగ సందర్భంగా, మూత్రవిసర్జనకు వెళుతున్న పూజారి భాస్కర్ అనే వ్యక్తిపై దేవరింటిపల్లి గ్రామానికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తి కట్టెతో తలపై దాడి చేయగా, బాధితుడికి తీవ్ర రక్తగాయమై స్పృహ తప్పినాడు. అతన్ని వెంటనే తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రి, అనంతరం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా బెంగళూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. విచారణలో భాగంగా నిందితుడు ఇస్మాయిల్ను 15-07-2025 తేదీన తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ చెక్‌పోస్ట్ వద్ద అరెస్టు చేయడం జరిగింది. నేరానికి ఉపయోగించిన కట్టెను స్వాధీనం చేసుకున్నాం. నిందితుడిని ఈ రోజు గౌరవనీయ న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని, ఈ కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోందనీ తనకల్లు ఎస్సై గోపి తెలిపారు.

### చదువుకునే ప్రతి బిడ్డకి తల్లికి వందనం పథకం

# అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది

### తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై వి బి రాజేంద్రప్రసాద్



పెనమలూరు నియోజకవర్గం (శుభోదయం న్యూస్): ఈరోజు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు టౌన్ పార్టీ అధ్యక్షులు జంపాన గురునాథరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని, వారికి అమలైన పథకాలు గురించి వివరించిన రాజేంద్రప్రసాద్ ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.... గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమ్మ ఒడి అని చెప్పి ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అంతమందికి డబ్బులు వేస్తామని చెప్పి ఇంటికి ఒకరికి మాత్రమే, అది కూడా కొంతమందికే ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందని, కానీ మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అంతమందికి కూడా డబ్బులు వేస్తామని గతంలో ఏదైతే హామీ ఇచ్చారో ఆ హామీని నిలబెట్టుకుంటూ ఇంట్లో ఇద్దరు ఉన్న, ముగ్గురు ఉన్నా, నలుగురు ఉన్నా కూడా అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా 13వ వార్డు



తెలుగుదేశం నాయకులు రాజేంద్రప్రసాద్ నిశాలువా కప్పి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కూనపరెడ్డి శ్రీనివాసు,మాజీ ఛైర్మన్లు జంపాన పూల, కుద్దుస్, 13వ వార్డు కౌన్సిలర్ పైలా శ్రీనివాస్, పదవ వార్డు కౌన్సిలర్ పల్యాల శ్రీను,14 వార్డ్ కౌన్సిలర్ కోరాడ వెంకటలక్ష్మి,3 వార్డు కౌన్సిలర్ తెనాలి పద్మావతి, 13 వార్డు అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు,లంక అప్పల నాయుడు ,పైడియ్య, అనిల్, సగర సాధికార కన్వీనర్ జంపన శ్రీనివాస్,మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అజ్మతుల్లా, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, చేదుర్తి పాటి ప్రవీణ్,4 వార్డ్ అధ్యక్షులు సాంబశివరావు, శివాలయం చైర్మన్ కుటుంబరావు,వైద్యశాల చైర్మెన్ మండవ జయదేవ్,పార్టీ నాయకులు వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్,రత్నం బుజ్జి, వీరంకి చింతయ్య,నజీర్,పుట్టి చంటి,సీనియర్ నాయకులు , మీసాల అప్పల నాయుడు,యూనిట్ ఇంచార్జ్ చలపాటి శ్రీను, జంపన నరసింహారావు ,పైడియ్య,వెంట్రప్రగడ వీరాంజనేయులు,కోడె హరీష్ ,చిట్టిమోతల సుబ్బారావు,చిట్టి,గఫూర్, సాంబశివరావు,అనిల్ సజిత్ ,జన సేన నాయకులు గిరిడి వెంకటేష్,అమరాపు సాంబశివరావు,సిగటాపు దుర్గా ప్రసాద్, శివ సాయి,వెంకటేష్ ,ఇంకా వార్డులోని పలువురు నాయకులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### తగ్గేదేలే.. కృష్ణా, గోదావరి జలాల వాటాపై

# సీఎం రేవంత్ కీలక నిర్ణయం..

అమరావతి,: కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలని, న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. కృష్ణాపై తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నారు. కృష్ణాతో పాటు గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకోవటంతో పాటు, ఇంతకాలం జరిగిన అన్యాయానికి శాశ్వతమైన పరిష్కారాలను సాధించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయన సూచనలతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కు లేఖ రాశారు. ఈనెల 16న ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రితో సమావేశమై తెలంగాణ నీటి వాటాల సాధనతో పాటు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. “కృష్ణా నదీ జలాల వినియోగంలో ఇంతకాలం తెలంగాణకు తీరని ద్రోహం జరిగింది. గడిచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైంది. తెలంగాణకు 299 టీఎంసీలు మాత్రమే నీటి వాటాకు అంగీకరించి ఏపీకి 512 టీఎంసీలు కట్టబెట్టింది. శ్రీశైలం ఎగువన ఏపీ అక్రమంగా నిర్మించుకున్న ప్రాజెక్టులన్నింటికీ వంత పాడి, కృష్ణా నీళ్లను ఏపీ యథేచ్ఛగా మళ్లించుకుంటే మౌనం వహించింది. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణాపై నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఇవ్వకుండా అసంపూర్తిగా వదిలేసింది. అటు గోదావరిపై తుమ్మిడిహెట్టిపై చేపట్టిన ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత పక్కనబెట్టింది. దానికి బదులు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రూ. లక్ష కోట్లకు పైగా ప్రజాధనం దుర్వినియోగం చేసింది.” అని ప్రకటనలో పేర్కొన్నారు.

# పేర్ని నాని వ్యాఖ్యలపై సోమిరెడ్డి కౌంటర్ ఎటాక్..

అమరావతి,: వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యలపై కౌంటర్ ఎటాక్‌కు దిగారు టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. సీఎం చంద్రబాబు 76 ఏళ్ల ముసలివాడు అంటూ.. పేర్నినాని చేసిన కామెంట్‌పై ఫైర్ అయిన సోమిరెడ్డి.. మాజీ మంత్రి పేర్ని నానికి కొవ్వు ఎక్కువైంది. చంద్రబాబుని, పవన్ కళ్యాణ్ ని, లోకేష్ ని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడు అని విరుచుకుపడ్డారు.. చంద్రబాబుతో పాటు పేర్ని నాని రామతీర్థం, అలిపిరి మెట్లు ఎక్కగలరా..? అనపర్తిలో చంద్రబాబు నడిచినట్లు 7 కిలోమీటర్లు నడవగలరా..? అని నిలదీశారు.. అయితే, నీ వయసు అయిపోయిందనే కదా? మొన్న పోటీ చేయలేదు.. అంటూ ఎద్దేవా చేశారు.. మరోవైపు, తన కుమారిడి రాజకీయ భవిష్యత్తు కోసం కొడాలి నాని, వంశీలను పేర్ని నాని ఇరికిస్తున్నాడని విమర్శించారు సోమిరెడ్డి బతుకు జీవుడా అంటూ వల్లభనేని వంశీ ఇప్పుడే జైలునుండి బయటికి వచ్చారు.. కానీ, ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.. రప్పా రప్పా అని రాం గోపాల్ వర్మ తో వైసీపీ వాళ్ళు ఒక సినిమా తీయించుకోవచ్చు అని సలహా ఇచ్చారు.. పేర్ని నానితో పాటు జగన్ కూడా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు.. కాకాణి గోవర్ధన్ రెడడ్ఇ, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి.. ఇలా పనికిమాలిన వాళ్లు వైసీపీలో ఉన్నారు అని విరుచుకుపడ్డారు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. ఇక, అశోక్ గణపతి రాజు గోవా గవర్నర్ గా నియమితులవ్వడం సంతోషం అని.. అశోక్ గజపతి చాలా క్రమశిక్షణ కల వ్యక్తి రాజనీతిజ్ఞుడు ప్రధాని నరేంద్ర మోడీ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఈ విషయంలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు సోమిరెడ్డి.. అశోక్ గజపతి రాజుకి గవర్నర్ పదవి రావడం సంతోషం..



# మళ్లీ వాయిదా



'ఘాటి' మూవీ విడుదల వాయిదా పడినట్లు యూవీ క్రియేషన్స్ తాజా నోట్ ద్వారా సంకేతాలిచ్చింది. సినిమా ఓ జీవ నది లాంటిది అంటూ భావోద్వేగపూరితంగా చెప్పిన ఈ పోస్ట్ నెటిజన్లను విసిగించింది. మూవీ రిలీజ్ వాయిదా వేస్తుంటే మామూలుగా చెప్పొచ్చు కదా.. ఇంత డ్రామా అవసరమా?" అంటూ సోషల్ మీడియాలో ఫైర్ అవుతున్నారు. జూలై 11 రిలీజ్ అని మేకర్స్ ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ట్రైలర్ లేకపోవడం ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. గ్రాఫిక్స్ వర్క్ ఇంకా పెండింగ్ కావడం వల్లే వాయిదా వేసినట్లు సమాచారం.

టాలీవుడ్‌లో పెద్ద సినిమాల వాయిదాల పర్వం కొనసాగుతోంది. మెగాస్టార్ 'విశ్వంభర' ఎప్పుడొస్తుందో కూడా అర్థం కావడం లేదు. అనుష్క శెట్టి , క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్లో తెరకెక్కిన ' ఘాటి ' చిత్రం మళ్లీ వాయిదా పడింది. ఇప్పటికే ఎన్నోసార్లు వాయిదా పడిన ఈ మూవీ మరోసారి వెనక్కి వెళ్లడం ఫ్యాన్స్‌ని హర్ట్ చేస్తోంది. ఈ విషయాన్ని యూవీ క్రియేషన్స్ అధికారికంగా వెల్లడించింది. ఈ పోస్టు చూసిన నెటిజన్లు మూవీ రిలీజ్ వాయిదా వేస్తున్నట్లు నేరుగా చెప్పొచ్చు కదా.. ఇంత డ్రామా అవసరమా? అని మేకర్స్‌ని ప్రశ్నిస్తున్నారు. వాయిదా వేస్తే వేశారు కనీసం ట్రైలర్ అయినా రిలీజ్ చేయొచ్చు కదా అని అడుగుతు న్నారు. మరికొందరైతే యూవీ క్రియేషన్స్‌కి సినిమాలు తీయడం తప్ప.. టైమ్‌కి రిలీజ్ చేయడం చేతకాదని, సినిమాలు మానేసి వేరే ఏదైనా పని చేసుకోవచ్చు కదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.'ఘాటి' మూవీని జులై 11న రిలీజ్ చేస్తున్నట్లు గత నెలలోనే మేకర్స్ ప్రకటించారు. అయితే టైమ్ దగ్గర పడుతున్నా రిలీజ్‌కి సంబంధించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వకపోవడం, ట్రైలర్ రిలీజ్ కూడా లేకపోవడంతో ఫ్యాన్స్ నిరాశ చెందారు. ఈ నేపథ్యంలోనే మూవీ మళ్లీ వాయిదా పడుతోం దని కొద్దిరోజులుగా వార్తలొస్తున్నాయి. దీనిపై ఏదొక క్లారిటీ ఇవ్వాలని మేకర్స్‌ని ఆడియన్స్ కోరుతున్నారు. దీంతో ఎట్టకేలకు యూవీ క్రియేషన్స్ స్పందించి ఓ నోట్ విడుదల చేసింది. గ్రాఫిక్స్ వర్క్ ఇంకా పెండింగ్ ఉండటం వల్లే 'ఘాటి'ని వాయిదా వేయడం తప్పలేదని అంటున్నారు. రిలీజ్ టైమ్‌కి ఎలాగైనా వర్క్ పూర్తి చేయాలని మేకర్స్ తొందరపెట్టినా టెక్నికల్ టీమ్ చేతులెత్తేసిందట. దీంతో 'ఘాటి' రిలీజ్ వాయిదా వేయక తప్పలేదని అంటున్నారు. ప్రస్తుతం వీరిద్దరి కాంబోలో వస్తోన్న 'ఘాటి' చిత్రం రిలీజ్‌కి ముందే లాభాలు తెచ్చిపెట్టిందట. 'ఘాటి' రూ.35 కోట్ల బడ్జెట్‌తో తీస్తే ప్రీ రిలీజ్ బిజినెస్ ద్వారా రూ.50 కోట్ల వరకు వచ్చిందట. థియేట్రికల్ రైట్స్ ద్వారా రూ12కోట్లు, ఓటీటీ, ఆడియో రైట్స్ ద్వారా రూ.38 కోట్ల వరకు వచ్చినట్లు తెలుస్తోంది.



# మీకెందుకు

ఈ తరం అమ్మాయిలు పెళ్లి కంటే కెరీర్‌పైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారన్నది కాదనలేని విషయం. ఇంతకు ముందు 16, 18 ఏళ్లకే అమ్మాయిలను పెళ్లీడుకొచ్చారనే వారు. ఇప్పుడు అంతా మారిపోయింది. 21 ఏళ్లు దాటిన తరువాతనే పెళ్లిపై ఆసక్తి చూపుతున్నారు. అయితే సినిమా రంగంలో అయితే 35 దాటిపోతోంది. చాలా మంది హీరోయిన్లు మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌గానే ఉంటున్నారు. అలాంటి వారిలో నటి రెజీనా ఒకరు. ఈమె బహుభాషా నటి. తమిళం, తెలుగు, కన్నడం భాషల్లో కథానాయకిగా నటించి పాపులర్ అయ్యారు. ముఖ్యంగా తమిళంలో 2005లో విడుదలైన కండనాళ్ మొదల్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత నటించిన అసుర చిత్రం మంచి పేరు తెచ్చిపెట్టినా, శివకార్తికేయన్‌కు జంటగా నటించిన కేడీబిల్లా కిల్లాడి రంగా చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తరువాత తెలుగు, కన్నడం భాషల్లోనూ పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. అయితే కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం లేదనే చెప్పాలి. దీంతో ప్రత్యేక పాటల్లో నటించడంతోపాటు ప్రతినాయకి పాత్రల్లో నటించడానికి సై అన్నారు. అదే సమయంలో వెబ్ సిరీస్‌లోనూ నటించడం ప్రారంభించారు. ఇలా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటున్న రెజీనా చాలా బోల్డ్ నటి అనే ముద్ర వేసుకున్నారు. అందాలారబోతకు నో చెప్పని ఈ భామ వయసు 34 ఏళ్లు. ఈమె తమిళంలో చివరిగా నటించిన చిత్రం విడాముయర్చి. అందులో నెగిటీవ్ పాత్రలో నటించా రు. కాగా ఇటీవల ఒక భేటీలో 34 ఏళ్లు వచ్చాయి. పెళ్లెప్పుడు చేసుకుంటారన్న ప్రశ్నకు ముక్కు సూటిగా బదులిచ్చిన రెజీనా పెళ్లెప్పుడు చేసుకుంటావని తన తల్లే అడగదని, మీరెందుకు అడుగుతు న్నారు? మీకెందుకు అంత అక్కర అని చెప్పింది. అంతే కాకుండా తనతో ఎవరైనా సంబంధం పెట్టుకుంటే వారికే కష్టం అనీ, అందుకే ఫ్రెండ్‌షిపే బెటర్ ఈజీగా ఉంటుందని చెప్పారు. దీంతో నెటిజన్లు ఈ అమ్మడిపై రకరకాల ట్రోల్స్ చేస్తున్నా రు.అసలు జీవితంలో పెళ్లి చేసుకుంటారా? అవివాహి తగానే ఉండిపోతారా? అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



# దమ్మున్న హీరోను తొక్కేయాలని..





సినిమా ఇండస్ట్రీలో నటీనటుల మధ్య పోటీ ఎప్పుడూ ఉండేదే! అయితే కొత్తగా వచ్చే హీరోహీరోయిన్స్ ఎదుగుతున్నారంటే కొందరు బడా స్టార్స్ అస్సలు తట్టుకోలేరు. హీరో కార్తీక్ ఆర్యన్ విషయంలో ఇదే జరిగిందంటున్నాడు సింగర్ అమాల్ మాలిక్.

సినిమా ఇండస్ట్రీలో పరిస్థితులు ఎలా ఉంటాయో జనాలకు అర్థమవుతోంది. ఇక్కడ చీకట్లోనే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్. . దాన్ని ఎదిరించలేకపోయాడు. అతడిది ఆత్మహత్య అని కొందరు, హత్య అని మరికొందరు అంటుంటారు. ఏదేమైనా అతడు మనమధ్య లేడనేది నిజం. ఈ పరిశ్రమ వారి మనసును, మెదడును దెబ్బతీస్తుంది. ఆత్మస్థైర్యాన్ని కోల్పోయే లా చేస్తుంది. సినిమా ఇండస్ట్రీ అనేదే ఒక మాయాప్రపంచం.

ఈ విషయం జనాలకు అర్థమయ్యాక బాలీవుడ్‌పై వారి అభిప్రాయమే మారిపోయింది. వీళ్లు చెడ్డవాళ్లు.. ఊరికే వదిలిపెట్టకూడదు అని జనాల్లో కోపం కట్టలు తెంచుకుంది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణంతో సెలబ్రిటీలను, వారి సినిమాలను ప్రజలు దూరం పెట్టారు. ఈ పతనాన్ని చూసేందుకు వారు నిజంగానే అర్హులు. ఒక మంచి మనిషి (సుశాంత్ సింగ్) మన మధ్య లేకుండా పోయాడు.

కార్తీక్ ఆర్యన్‌ను కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తొక్కడానికి ప్రయత్నించారు. కానీ, అతడు చిరునవ్వుతోనే ఆ సమస్యలను జయించాడు. అతడికి పేరెంట్స్ సపోర్ట్ ఉంది. ఇండస్ట్రీకి కొత్తవాడయినా తన స్వయంకృషితో ఎదిగాడు. కార్తీక్‌ను ఇండస్ట్రీ నుంచి బయటకు పంపించేందుకు దాదాపు వంద మంది ప్రయత్నిస్తున్నారు. అందులో హీరో లు, నిర్మాతలు. ఉన్నారు అని చెప్పుకొచ్చాడు.

సమంత నటి సమంత రూటే వేరు. తనకు నచ్చినట్లు ప్రవర్తించే నటీమణుల్లో ఈమె ముందుంటుందని చెప్పవచ్చు. ఎప్పుడూ సోషల్‌మీడియాతో తన అభిమానులకు ఆమె టచ్‌లో ఉంటారు. తనకు నచ్చిన ప్రతి విషయాన్ని ఆమె

# అప్పుడు అర్థం అయింది

పంచుకుం టారు. విడాకులు, మయోసైటిస్ ఇలా తన జీవితంలో ఎదురైన క్లిష్ట పరిస్థితుల గురించి కూడా అందులో వ్యక్తపరుస్తూ ఉంటారు. తాజాగా తాను ఎవరూ..? ఎంత పెద్ద సెలబ్రిటీ..? జీవితంలో ఏం సాధించానో తెలుసుకున్నానని చెప్పుకొచ్చారు.

విడాకులు పొందిన సమంత ఆ తరువాత మయోసైటీస్ అనే అరుదైన వ్యాధికి గురై దాని నుంచి బయట పడటానికి పెద్ద పోరాటమే చేశారు. అలా చాలా కాలం నటనకు దూరం అయిన ఈమె మళ్లీ నటించడానికి సిద్ధం అయ్యారు. అలా వెబ్ సిరీస్‌లో నటించిన సమంత ఇటీవల నిర్మాతగానూ అవతారమెత్తి శుభం అనే చిత్రాన్ని నిర్మించారు కూడా. ఇలా నిత్యం సామాజిక మాధ్యమాల్లో యాక్టీవ్‌గా ఉంటున్న సమంత తాజాగా సామాజిక మాధ్యమాల్లో మరో టీట్ చేశారు. అందులో తన చేతిలో ఎప్పుడూ సెల్‌ఫోన్ ఉంటుందన్నారు. దీంతో సడన్‌గా తనకొక ఆలోచన వచ్చిందనీ, దీంతో వెంటనే తన సెల్‌ఫోన్‌ను మూడు రోజుల పాటు స్విచ్ఛ్ ఆఫ్ చేసినట్లు చెప్పారు. ఆ మూడు రోజులు ఎవరితోనూ మాట్లాడలేదనీ, ఎవరినీ చూడలేదనీ, పుస్తకాలు చదవడం, రాయడం వంటివేవీ చేయలేదన్నారు. ఇంకా చెప్పాలంటే ఏ పని చేయలేదన్నారు.

అలా మూడు రోజులు మెదడుకు పూర్తిగా విశ్రాంతినిచ్చినట్లు చెప్పారు. ఆ అనుభవం చాలా కొత్తగా ఉందన్నారు. తన ఈగోలో చాలా భాగం తన సెల్‌ఫోన్‌తోనే అన్నది అప్పుడు అర్థం అయ్యిందన్నారు. తాను ఎవరూ? ఎంత సెలబ్రిటీనీ? ఏం సాధించాను? అన్న విషయాలు తన సెల్‌ఫోన్‌నే చెబుతుందన్నారు. అది లేని రోజున తాను ఒక సాధారణ జీవినని అనే భావన కలిగిందన్నారు. పుట్టుకకు గిట్టుటకు మధ్య కాలంలో సెల్‌ఫోన్ మనకు ప్రకృతికి చెందిన విషయాలను కనుమరుగు చేసిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మన పెద్దలకు, ఆరోగ్యానికి సెల్‌ఫోన్ ఎంత ఆటంకంగా మారిందన్నది అవగతం చేసుకున్నానని నటి సమంత అన్నారు. ఈమె చేసిన పోస్ట్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# హైకోర్టులో సైఫ్‌కు చుక్కెదురు

మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఆయన కుటుం బానికి చెందిన రూ.15,000 కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీ గా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. భోపాల్‌లో సైఫ్ కుటుంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంత మైన భవంతులు వారసత్వ ంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యం లో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తాత)ను వివాహమా డారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటుంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీ దా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆస్తులను కాందిశీ కుల ఆస్తులుగా గుర్తి స్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 20 15లో ప్రకటించింది.

# హిట్ కొట్టేలా..



సినిమా నుంచి తాజాగా ట్రైలర్ విడుదలైంది. ఈ ప్రేమకథ చిత్రానికి రామ్ గోదాల దర్శకత్వం వహించారు. ఈ సినిమాను వీ ఆర్ట్స్ బ్యానర్‌లో హరీశ్ నల్లా నిర్మించారు. జూలై 11న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను మెప్పించాయి. తాజాగా వచ్చిన ట్రైలర్ కూడా అంతే స్థాయిలో ఉంది. కామెడీ, లవ్, ఎమోషనల్ సీన్స్‌తో ట్రైలర్ కట్ ఉండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. కాగా.. ఈ చిత్రంలో రవీందర్ విజయ్, బబ్లూ పృథ్వీ రాజ్, ప్రభాస్ శ్రీను, రఘు కారుమంచి, సాత్విక్ ఆనంద్, నయని పావని ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రాధన్ సంగీతమందిస్తున్నారు.